ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 12 జూలై 2024

ర్యాలీలో ఇసుక ట్రాక్టర్‌ను నడుపుతున్న టీడీపీ నాయకులు



ఉచిత ఇసుకతో నిర్మాణ రంగానికి పూర్వ వైభవం

● ఇసుక ట్రాక్టర్ల ర్యాలీలో టీడీపీ నాయకులు

ములకలచెరువు, జూలై 11: ఉచితంగా ఇసుక పంపిణీతో నిర్మాణ రంగానికి పూర్వ వైభవం వస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఇసుకను అందిస్తుండడంతో గురువారం ములకలచెరువులో మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్థానిక పెట్రోల్ బంకు నుంచి ఆర్టీసీ బస్టాండు మీదుగా బస్టాండు సర్కిల్ వరకు ట్రాక్టర్లతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రారంభించిన ఉచిత ఇసుకతో గృహ నిర్మాణదారులకు, కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుక పాలసీ ద్వారా నిర్మాణ రంగం కుదేలైందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నకిష్టా, టీడీపీ నేతలు కేశవులు, కేవీ రమణ, వెంకటస్వామి, నాయకులు భజంత్రి రామాంజులు, సోమశేఖర్, రెడ్డెప్ప, ప్రతాప్‌నాయుడు, ఉమాశంకర్, రామచంద్ర, నాగేంద్ర, రమణమూర్తి, రమేష్‌నాయుడు, కుళాయప్ప, శ్రీనివాసులు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుట్టనూ మింగేశారు..!

- పుల్లంపేటలో వైసీపీ ముఖ్య నాయకుడి అనుచరుల భూదందా..
- రంగంపల్లెలో 40 ఎకరాలు..
- పుత్తనవారిపల్లె గుట్టపై పది ఎకరాలు ఆక్రమణ...
- ప్రభుత్వ స్థలంలో బోర్లు.. ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు...
- ప్రభుత్వ భూములను ఆన్‌లైన్ చేసేసిన తహసీల్దార్‌లు



గుట్టపైన స్థలం చదును చేసి ఏర్పాటు చేసిన కంచె

పుల్లంపేట, జూలై 11 : జిల్లాలో ఆ వైసీపీ నాయకుడి పేరు తెలియని వారుండరు. ఆయన అడవుల్లో తన సామ్రాజాన్ని విస్తరిస్తే.. ఆయన అనుచరులు తామేమీ తక్కువ కాదన్నట్లు ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆయన పేరు నిలబెట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులు, గుట్టలను కూడా వదలకుండా తమ కబంధ హస్తాల్లో బంధించుకున్నారు. రికార్డులు లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా కొన్నిచోట్ల విలువైన భూములను కూడా తహసీల్దార్లను వివిధ రకాలుగా లోబరచుకుని ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇప్పుడు ఆ భూముల్లో బోర్లు వేసి ట్రాన్స్‌ఫార్మర్‌లను బిగించి స్వాధీనం చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం పోయి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారులు వారికి సహకరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. శ్మశానానికి స్థలం ఇవ్వండి బాబు అని పది సంవత్సరాలుగా అడుగుతున్న దళితులను పక్కనపెట్టి ఆక్రమార్కులకు ఆ తహసీల్దార్లు ఎలా సహకరించారో వైసీపీ నాయకుల ఆధీనంలో ఉన్న భూములను చూస్తే అర్థం చేసుకోవచ్చు.

పుల్లంపేట మండలంలో కడప-చెన్నై హైవే పక్కనే పుత్తనవారిపల్లె సమీపంలో గుట్ట ఉంది. మండల కేంద్రమైన పుల్లంపేటలో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో ఇక్కడికి మంజూరైన ఆదర్శ పాఠశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రభుత్వ నర్సరీలను పుత్తనవారిపల్లె గుట్ట వద్ద ఏర్పాటు చేశారు. వీఏవోగా ఉన్న తన తల్లికి బదులుగా తహసీల్దార్ కార్యాలయం లో వైసీపీ ప్రభుత్వంలో ఓ వ్యక్తి చక్రం తిప్పాడు. తహసీల్దార్‌లకు పలు రకాలుగా ఉపయోగపడి పుత్తనవారిపల్లె గుట్ట వద్ద ప్రభుత్వ భూములను వారి బంధువుల పేరుతో ఆక్రమించుకుని ఆన్‌లైన్ చేయించుకున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. తరువాత మరి కొంతమంది కూడా గుట్టను చదును చేసి ఫెన్సింగ్ వేశారు ఇప్పుడు ఆ భూమిని ఒక ఎస్టేట్‌లాగా తయారు చేసుకున్నారు. ఇది చాలదన్నట్లు రంగంపల్లె రెవెన్యూ పొలంలో సర్వే నెంబర్-522ను సబ్ డివిజన్ చేయించుకుని కొంతమంది వారి బంధువుల పేర్లతో ఆన్‌లైన్ చేయించుకున్నారని స్థానికులు చెబుతున్నారు. సర్వే నెంబర్-587లో 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా ఆన్‌లైన్ చేసుకున్నారు. దీని చుట్టూ ఉన్న పలు సర్వే నెంబర్లలో సుమారు 40 ఎకరాలకు పైగా ఆక్రమించి ఆ స్థలాల్లో బోర్లు వేసి ట్రాన్స్‌ఫార్మర్‌లు కూడా ఏర్పాటు చేసుకున్నారు. వైసీపీలో ఆ ముఖ్య నాయకుడి పేరు చెప్పి అతడి అనుచరులు ఈ ప్రాంతంలో ఆక్రమణలు చేశారు. దీనిపై కొన్ని సర్వే నెంబర్లపైన వైసీపీ వర్గీయులు కొందరు అప్పటి తహసీల్దార్ నరసింహమూర్తికి ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణలో అది ప్రభుత్వ భూమి అని తేలడంతో ఆయన ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఏమైందో ఏమో కానీ అదే తహసీల్దార్ తిరిగి ఆ భూమిని అదే వ్యక్తులకు ఆన్‌లైన్ చేయడం కొసమెరుపు. జాగువారిపల్లె పంచాయతీలోని హెచ్‌డీసీ కాలనీలో అరుంధతివాడ ప్రజలు తమకు శ్మశానానికి స్థలం కేటాయించాలని పది సంవత్సరాలుగా వేడుకుంటున్నా కనికరించని తహసీల్దార్ అదే ప్రాంతంలో ప్రభుత్వ భూములను స్మగ్లర్లకు ఆన్‌లైన్ చేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులతో అంటకాగిన తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు వారి ద్వారా అన్ని పనులు చేయించుకుని వారికి పూర్తి స్థాయిలో ప్రభుత్వ భూములు కట్టబెట్టారంటే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఒక్కొక్క ఆన్‌లైన్‌కు ఒక్కొక్క రేటు చొప్పున లక్షా 50 వేల రూపాయల వరకు ఒక్కొక్క రైతు నుంచి ఆన్‌లైన్ మార్చేందుకు రేటు పెట్టారంటే ఏ స్థాయిలో అధికారులు సంపాదించారో తెలుసుకోవచ్చు. వేల సంఖ్యలో ఆన్‌లైన్‌లో అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపితే అక్రమాలన్నీ బయటకు వస్తాయి. భూఆక్రమణలపై తహసీల్దార్ వెంకటనారాయణను వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పుత్తనవారిపల్లె గుట్టపైన తహసీల్దార్ ఆన్‌లైన్ చేసిన స్థలంలో ఉన్న ఎస్టేట్







రంగంపల్లెలోని సర్వే నెంబర్ 587లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి.. ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్.. ఆక్రమిత భూమిలో వేసిన బోరు

డంప్ చేసిన 60 టన్నుల ఇసుక సీజ్



చెన్నరాయునిపల్లె సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పెద్దతిప్పసముద్రం, జూలై 11 : టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె సమీపంలో నిల్ల చేసిన 60 టన్నుల ఇసుకను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. పాపాఘ్ని నది నుంచి ఓ వైసీపీ నాయకుడు రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా తరలించి డంప్ చేశాడు. స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో తహసీల్దార్ నరసంహరావు, ఎస్ఈబీ అధికారులు, స్థానిక పోలీసులు చెన్నరాయునిపల్లెకు చేరుకుని అక్రమంగా తరలించి డంప్ చేసిన ఇసుకను పరిశీలించారు. ఆ వైసీపీ నాయకుడి వద్ద సరైన రికార్డులు లేకపోవడంతో అధికారులు ఇసుకను సీజ్ చేసి నివేదికను అధికారులకు పంపించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. డంప్ చేసిన ఇసుక సుమారు 60 టన్నులు ఉంటుందని అధికారులు తెలిపారు.

మల్లయ్యకొండకు రూ.6.79 లక్షల ఆదాయం

తంబళ్లపల్లె, జూలై 11: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రూ.6,79,677 ఆదాయం వచ్చినట్లు ఈవో రమణ తెలిపారు. గురువారం మల్లయ్యకొండపైన ఆలయంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌రెడ్డి, టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈ ఏడాది మార్చి 9వ తేదీ (మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం) నుంచి ఈనెల 10వ తేదీ వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మల్లయ్యకొండ ఆలయం దినదినాభివృద్ధి చెందుతుండటం, కొండ పైకి పూర్తి స్థాయిలో రోడ్డు సౌకర్యం ఉండటంతో భక్తుల తాకిడితో పాటు హుండీ ఆదాయం పెరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కొండ కిట్ట, ఈశ్వర, అర్చకులు ఈశ్వరప్ప, భక్తులు పాల్గొన్నారు.



హుండీ కానుకలను లెక్కిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

పారదర్శకంగా అమలు కావాలి

● లాభాపేక్ష లేకుండా వినియోగదారులకు ఇసుక సరఫరా ● హౌసింగ్ శాఖకు 43 వేల మెట్రిక్ టన్నుల ఇసుక : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటి (కలెక్టరేట్) జూలై 11: జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వానికి ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం నిర్వహణ చార్జీల వసూలుతో వినియోగదారులకు డిపోల ద్వారా ఇసుక సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రభుత్వ ఉత్తర్వులను పటిష్టంగా అమలు పరచాలని ఆదేశించారు. ఒక్కో రీచ్ పరిధిలోని స్టాక్ పాయింట్‌కు ఒక్కొక్క ధర నిర్ణయించిందని, ఆ ధరపై రవాణా చార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని నదులు, కెనాల్, బ్యారేజ్‌లు, డ్యాంలలో అందుబాటులో ఉన్న దంపులను గుర్తించి రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాయింట్లను గుర్తించి ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వాటికి అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవలని గనులశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో హౌసింగ్‌కు ఎంతమేరకు ఇసుక అవసరం అవుతుందని హౌసింగ్ పీడీని కలెక్టర్ అడుగగా 43 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం అవుతుందని పీడీ సమాధానం ఇచ్చారు. జిల్లాలో ఎక్కడక్కడ ఇసుక అక్రమ నిల్వలు ఉన్నాయో తెలుసుకుని గనుల శాఖ ద్వారా నోటీసులు ఇచ్చి వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో దాదాపు 45 వేల మెట్రిక్‌టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని, నోటీసు పీరియడ్ ముగిసిన తరువాత మార్గదర్శకాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శికాల మేరకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, మైనింగ్ శాఖ ఏడీ రవిప్రసాద్, హౌసింగ్ పీడీ శివయ్య, ప్రసన్నకుమార్, డీపీవో ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి..

హౌసింగ్ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఇళ్ల నిర్మాణాలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి హౌసింగ్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ఇసుక, కడ్డీలు, సిమెంట్ కొరత రాకుండా చూడాల్సిన బాధ్యత హౌసింగ్ అధికారులపై ఉందన్నారు. ఇప్పటి వరకు ప్రారంభం కాని ఇళ్లు 1123 కాగా, 9748 బీబీఎల్, 19570 బీఎల్, 854 లింటల్‌లెవల్, 6135 రూఫ్‌లెవల్, 4751 ఆర్‌సీలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌సీ లెవల్‌లో ఉన్న 4751 ఇళ్లను వంద రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య, డ్వామా పీడీ మద్దిలేటి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ నెంబర్‌తో అప్రమత్తంగా ఉండండి

రాయచోటి (కలెక్టరేట్), జూలై 11: తన ఫొటో ఉన్న వాట్సప్ నెంబర్లతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఫొటోతో ఉన్న ఒక ఫేక్ వాట్సప్ నెంబర్ నుంచి అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న కొంతమంది అధికారులకు మెసేజ్‌లు వెళ్లినట్లుగా అధికారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తన ఫొటోతో ఉన్న వాట్సప్ నెంబర్లతో జాగ్రత్తగా ఉండాలని, అధికారిక నెంబర్ నుంచి మాత్రమే అధికారులతో సంభాషణ జరుగుతుందని తెలిపారు. అధికారిక నెంబర్ నుంచి కాకుండా మరే ఇతర నెంబర్ నుంచి అయినా ఎటువంటి మెసేజ్‌లు వచ్చినా వాటిపై సైబర్‌సెల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆ ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు.

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు

రాయచోటి (కలెక్టరేట్), జూలై 11: ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుని ధరలను నియంత్రించిందని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్‌లో బియ్యం రూ.55.85 ఉండగా దానిని తగ్గించి రూ.49లకు, కందిపప్పు రూ. 174 ఉండగా దానిని తగ్గించి రూ.160 ఇస్తుందని తెలిపారు. రాయచోటి లోని విశాల్ మెగామార్ట్, రైతుబజార్, వ్యాపారాల సముదాయం, మార్కెట్‌వీధి, మదనపల్లెలోని విశాల్ మెగామార్ట్, రిలయన్స్ స్మార్ట్ స్టోర్, రిలయన్స్ స్టోర్ ఎస్‌బీఐ కాలనీ, శ్రీరాధాకృష్ణ ట్రేడర్స్, అప్పారావువీధి, రాజంపేటలోని శ్రీలక్ష్మి నరసింహ రైస్‌మిల్లు ప్రాంతాలలో నిత్యావసర వస్తువులు అమ్ముతారని జేసీ తెలిపారు.

రైతు బిడ్డకు సీఏలో ఆలిండియా 14వ ర్యాంకు



తల్లితండ్రులతో తేజశ్విని

తంబళ్లపల్లె, జూలై 11: తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన కె.రఘురాంరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజశ్విని గురువారం విడుదలైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సీఏ ఫైనల్ ఫలితాల్లో సత్తా చాటి ఆలిండియా 14వ ర్యాంకు సాధించింది. ఓ సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన తేజశ్విని తల్లిదండ్రుల కష్టాన్ని చూస్తూ చిన్నతనం నుంచే చదువులో ప్రతిభ కనబరచేది. తేజశ్విని ప్రాథమిక విద్య తంబళ్లపల్లెలో పూర్తి చేసి జవహర్ నవోదయలో సీటు సాధించింది. సీఏ చేయాలనే లక్ష్యంతో పట్టుదలతో చదివి సీఏ ఫైనల్ ఫలితాల్లో 455 మార్కులతో జాతీయ స్థాయిలో 14వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా తేజశ్విని మాట్లాడుతూ తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం, ఉపాధ్యాయుల ప్రేరణతో కష్టపడి పట్టుదలతో చదివి జాతీయ స్థాయిలో 14వ ర్యాంకు సాధించినట్లు తెలిపింది. తేజశ్విని సీఏలో సాధించిన విజయంపై విద్యాశాఖాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

మదనపల్లె విద్యార్థికి 37వ ర్యాంకు



హర్షితారెడ్డి

మదనపల్లె అర్బన్, జూలై 11: గురువారం విడుదలైన (ఐసీఏఐ) సీఏ ఫైనల్స్ ఫలితాల్లో మదనపల్లెకు చెందిన వై.హర్షితారెడ్డి ఆల్ ఇండియా స్థాయిలో 37వ ర్యాంకు సాధించింది. పట్టణంలోని ఎస్బీఐ కాలనీకి చెందిన ఆర్టీసీ కండక్టరు సోముశేఖర్, నందిని దంపతుల కుమారై హర్షితారెడ్డి సీఐ ఫైనల్స్‌లో రెండు గ్రూపులకు కలిపి ఆల్ ఇండియా 37వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా పలువురు హర్షితను అభినందించారు.

హరికృష్ణకు 15వ ర్యాంకు

తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తాండా గ్రామం ఎద్దులవేమన్నగారిపల్లెకు చెందిన ఎద్దుల గంగిరెడ్డి, రవణమ్మ దంపతుల కుమారుడు ఎద్దుల హరికృష్ణ సీఏ ఫైనల్ ఫలితాల్లో 15వ ర్యాంకు సాధించాడు. హరికృష్ణ పదో తరగతి అనంతపురం జిల్లా ఓబులదేవరచెరువులోని విజ్ఞాన్ హైస్కూల్‌లో, ఇంటర్మీడియట్ తిరుపతి శ్రీచైతన్య కళాశాలలో పూర్తి చేశాడు. సీఏ కావాలన్న లక్ష్యంతో కష్టపడి చదివి ఎటువంటి శిక్షణ లేకుండా 454/600 మార్కులతో సీఏ ఫైనల్‌లో జాతీయ స్థాయి 15వ ర్యాంకు సాధించాడు. హరికృష్ణ ఆలిండియా 15వ ర్యాంకు సాధించడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.



తల్లిదండ్రులతో హరికృష్ణ

ఉత్కంఠ భరితంగా హాకీ పోటీలు



సౌత్ ఇండియా హాకీ చాంపియన్‌షిప్ పోటీలో తలపడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జట్లు

పులివెందుల రూరల్, జూలై 11: పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీలో జరుగుతున్న సౌత్ ఇండియా హాకీ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. గురువారం జరిగిన జూనియర్ ఉమెన్ విభాగంలో కేరళ-పాండిచ్చేరిల మధ్య జరిగిన మ్యాచ్‌లో 5-0 తేడాతో కేరళ జట్టు విజయం సాధించింది. అలాగే తమిళనాడు-కర్ణాటక మధ్య జరిగిన మ్యాచ్‌లో 1-3 తేడాతో కర్ణాటక, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 0-11తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. జూనియర్ మెన్ విభాగంలో తమిళనాడు-పాండిచ్చేరి మధ్య మ్యాచ్ జరగ్గా 7-0తేడాతో తమిళనాడు, తెలంగాణ-కేరళ మధ్య జరిగిన మ్యాచ్‌లో 3-0 తేడాతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్-కర్ణాటక మధ్య జరిగిన మ్యాచ్‌లో 0-4 తేడాతో కర్ణాటక జట్లు విజయం సాధించాయి.

నేడు ఎంపీ సీఎం రమేశ్ కడప జిల్లాకు రాక

ప్రొద్దుటూరు, జూలై 11: అనకాపల్లి బీజేపీ ఎంపీగా భారీ మెజారిటీతో గెలుపొందిన సీఎం రమేశ్ జిల్లాకు మొదటిసారిగా శుక్రవారం రానున్నారని ఆయన సోదరుడు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేశ్‌నాయుడు తెలిపారు. గురువారం స్థానిక పీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ సీఎం రమేశ్ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి నేరుగా దేవుని కడపకు చేరుకుని వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారన్నారు. అలాగే కడప పెద్ద దర్గాలో ఆశీస్సులు తీసుకుని రోడ్డు మార్గాన చెన్నూరు, ఖాజీపేట, మైదుకూరు మీదుగా ప్రొద్దుటూరుకు, అక్కడి నుంచి ర్యాలీగా పోట్లదుర్తికి చేరుకుంటారన్నారు.

'సంపద' కేంద్రాలు నిర్వీర్యం

- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. నీరుగారిన లక్ష్యం
- మరుగున పడిన చెత్త సంపద తయారీ కేంద్రాలు
- జీతాల కోసం గ్రీన్ అంబాసిడర్స్ ఎదురుచూపు
- కూటమి ప్రభుత్వంలో... మనుగడ సాగించేనా

సంబేపల్లె, జూలై 11: గ్రామీణ ప్రాంతాలే దేశ ప్రగతికి మూల స్తంభాలు. ఇందులో భాగంగా స్వచ్ఛభారత్ కింద గ్రామ పంచాయతీల ఆర్థిక ఆదాయాన్ని పెంచేందుకు 2014లో టీడీపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. ఒక్కో కేంద్రానికి రూ.8 నుంచి 10 లక్షల వరకు ఖర్చు చేసి నిర్మించారు. ఒక్కో మండలంలో సరాసరి 15 నుంచి 20 కేంద్రాలు నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం జనాభాను బట్టి గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేశారు.

నీరు గారిన పథకం లక్ష్యం


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం


చెత్త నుంచి నాడప్ కంపోస్టుల ద్వారా ఎరువులను తయారు చేసి.. రైతులు పంట సాగులో రసాయనిక ఎరువుల బదులు సేంద్రియ ఎరువులు వాడుకునే విధంగా గ్రామ పంచాయతీ ఆదాయాలను పెంచాలనుకున్నారు. తడి, పొడి చెత్తసేకరణ చేపట్టి తద్వారా సంపదను సృష్టించవచ్చునని భావించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం మారడంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై నిర్లక్ష్యం ప్రదర్శించడంతో సంపద సృష్టి కేంద్రాలు నిర్వీర్యం అయిపోయాయి. ఈ పథకం లక్ష్యం నీరుగారిందనే చెప్పవచ్చు.

సక్రమంగా సాగని చెత్తసేకరణ



సంబేపల్లె మండలంలో 15 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు కలవు. 34 మంది గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేశారు. వీరికి గ్రామ పంచాయతీ నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేలు అందించా లి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి కేంద్రానికి తరలించాలి. అక్కడ పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులు, గాజు పరికరాలు, ప్లాస్టిక్ వస్తువులు, ఇనుప వస్తువులు వేర్వేరుగా చేసి తడి, పొడి చెత్తగా విభజించాలి. అయితే మండల వ్యాప్తంగా చెత్త సేకరణ చాలా గ్రామాల్లో జరగలేదు. అధికారులు మాత్రం చెత్త నుంచి వేరు చేసిన ప్లాస్టిక్ గాజు సీసాలు, ప్లాస్టిక్ ద్వారా నెలకు కొన్ని కేంద్రంలో 200 మరికొన్ని కేంద్రాల్లో 500, మరికొన్ని కేంద్రాల్లో 1000 నుంచి 1500 వస్తున్నట్లు చెబుతున్నారు. సంబేపల్లె మండలంలో 34 మంది గ్రీన్ అంబాసిడర్లకు నెలకు రెండు లక్షల రూపాయలు జీతాల ద్వారా చెల్లించాలి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయం వేలల్లో ఉంటే జీతాలు మాత్రం లక్షల్లో ఉన్నాయి. దీంతో రాబడి తక్కువ, ఖర్చులు ఎక్కువ అని చెప్పవచ్చు.

నాడాఫ్ కంపోస్ట్ పిట్స్‌లో పిచ్చిమొక్కలు



ఒక్కో పంచాయతీలోని హ్యాబిటేషన్‌లో ఒక రైతుకు నాడాఫ్ కంపోస్టు బిట్స్ కోసం ఉపాధి హామీ పథకంలో సేంద్రియ ఎరువులు తయారు చేసే విధంగా వీటిని సుమారు రూ.12 వేల అంచనాతో నిర్మించారు. ఇప్పటి వరకు చెత్త నుంచి సంపద కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. ఎక్కడా కంపోస్ట్ ఎరువులు మాత్రం తయారు కాలేదు. పిచ్చిమొక్కలతో కనిపిస్తున్నాయి. వేల రూపాయలు ఖర్చు పెట్టి నిరుపయోగంగా వదిలేశారు.

అసంపూర్తిగా సంపద తయారీ కేంద్రాలు


గాండ్లపల్లి వద్ద ఫిల్లర్ల దశలో ఆగిన సంపద తయారీ కేంద్రం

మండల వ్యాప్తంగా ఉన్న 15 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో కొన్ని చోట్ల కొన్ని పనులు అసంపూర్తిగా వదిలేశారు. శెట్టిపల్లె గ్రామంలో గాండ్లపల్లి వద్ద ఇప్పటికీ పిల్లర్ల దశలో నిర్మాణం చేశారు. కొన్ని చోట్ల గదులు నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

జీతాల కోసం గ్రీన్ అంబాసిడర్స్ ఎదురుచూపు



మండలంలో ఏర్పాటు చేసిన గ్రీన్ అంబాసిడర్స్ చెత్త సేకరణ సిబ్బందికి వైసీపీ ప్రభుత్వంలో ఏడాదిగా జీతాలు అందలేదు. జీతం కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను కూడా అప్పటి ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో దుర్భర స్థితిలో పంచాయతీ మనుగడ సాగింది. ఇప్పటికైనా పనిచేసిన గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలో మనుగడ సాగించేనా...

2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. అసంపూర్తిగా ఉన్న సంపద సృష్టి కేంద్రాల పరిస్థితిపై దృష్టి సాధించాలి. వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన సంపద సృష్టి కేంద్రాలను మనుగడ సాగించేలా చర్యలు చేపట్టి గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

హుండీల లెక్కింపు... రూ.23.87లక్షల ఆదాయం



చక్రాయపేట, జూలై 11: గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ లెక్కింపు ద్వారా రూ.23,87,865 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. జిల్లా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యల ఆధ్వర్యంలో 105 రోజులకు సంబంధించి హుండీల లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్కేవ్యాలీ ఏఎస్ఐ రామకృష్ణ, ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ బబానుచందర్, క్యాషియర్ అన్వేష్, ఉప ప్రధాన అర్చకులురాజారమేష్, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామర్థ్యాలు మెరుగుపడాలి : డీఈఓ


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 11: విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు మెరుగుపడాలని జిల్లావిద్యాశాఖాధికారి అనురాధ సూచించారు. గురువారం కడప నగరం అలంఖాన్‌పల్లె మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యాసామర్థ్యం మెరుగుపరచాలన్నారు. ప్రతి విద్యార్థిపై కేర్ తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా రాయడం, చదవడం నేర్పించాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్నాభోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఉండాలని, నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

బొప్పాయి తోటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

కొండాపురం, జూలై 11: మండలంలోని గండ్లూరు పొలంలో ఉన్న బొప్పాయితోటను డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ సుశీల, డాక్టర్ సునీల్ కుమార్‌లు పరిశీలించారు. వీవీ నరసింహారెడ్డి అనే రైతు తన ఏడు ఎకరాల పొలంలో 3500 బొప్పాయి మొక్కలను నాటాడు. ఏడు నెలలైనా మొక్కలు పెరి గినప్పటికీ దిగుబడి రావపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శాస్త్రవేత్తలు బొప్పాయితోట మట్టి నమూనలతో పాటు, వేర్లు తదితర వాటిని శాంపిల్స్ తీసుకున్నారు. అధికారుల సూచన మేరకు సరైన సమయంలో సరైన మందులు, ఎరువులు వాడినా దిగుబడి రాలేదని రైతు శాస్త్రవేత్తలకు వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ మధుమల్లేశ్వర రెడ్డి, ఏవో రామాంజలరెడ్డి, జైన్ డ్రిప్ ప్రతినిధి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధార్ మార్ఫింగ్ చేసి అక్రమ రిజిస్ట్రేషన్ నిందితుల అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

ముద్దనూరు జూలై 11: ఆధార్ కార్డు మార్ఫింగ్ చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ భూ రిజిస్టర్ చేసుకున్న చిన్నదుద్యాల గ్రామానికి చెందిన బోరెడ్డి వెంకట మదన్‌మోహన్ రెడ్డిని గురువారం అరెస్టు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. బోరెడ్డి వెంకట మదన్‌మోహన్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన బోరెడ్డి ప్రభావతమ్మకు చెందిన భూమి సర్వే నెంబరు 25లోని 4.45 ఎకరాల భూమిని అతని మేనత్త సానం సావిత్రమ్మ ఆధార్‌కార్డుతో మార్ఫింగ్ చేసి ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ప్రస్తుతం బోరెడ్డి ప్రభావతమ్మ వేరే గ్రామంలో నివాసం ఉంది. ఇందుకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీ ముద్దనూరు సబ్ రిజిస్ట్రార్ మహబూబ్‌బాషా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం బోరెడ్డి వెంకట మదన్‌మోహన్‌రెడ్డి, ఆధార్ మార్ఫింగ్ చేసిన కడప సిటీలోని ఓ నెట్ సెంటర్ యజమాని బండినాగిరెడ్డి మరి కొందరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


పట్టుబడ్డ దుంగలు, నిందితులతో టాస్క్‌ఫోర్స్, అటవీశాఖ సిబ్బంది

రాజంపేట/సుండుపల్లె, జూలై 11: రాజంపేట అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు మెరుపుదాడులు చేసి 8 మంది స్మగ్లర్లను అరెస్టు చేసి.. 11 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సానిపాయ రేంజ్‌లో తనిఖీ చేస్తుండగా రాయవరం సెక్షన్ పరిధిలో ఈ సంఘటన జరిగినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బ ందిని చూసి స్మగ్లర్లు దుంగలను అక్కడే పడేసి పారిపోతుండగా వారిని వెంబడించి 8 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లా అంబూరు తాలూకాకు చెందిన గోవిందన్, శ్రీనివాసన్, మురగన్, శక్తివేల్, తిరుపతి సెల్వం, సెల్వం చిన్నా, సురేష్‌లతో పాటు అనంతపురం జిల్లా కన్నపల్లెకు చెందిన వడ్డే సుబ్రమణ్యంలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీశాఖ సిబ్బంది కె.సురేష్‌రాజు, వినోద్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

లింగారెడ్డిపల్లెలో చోరీ

కలసపాడు, జూలై 11: మండలంలోని లింగారెడ్డిపల్లెలో గురువా రం చోరీ జరిగింది. ఎస్ఐ నాగమురళీ తెలిపిన వివరాల మేరకు.. లింగారెడ్డిపల్లెకు చెందిన పాలకొలను రామసుబ్బారెడ్డి ఇంటి ఆరుబయట నిద్రిస్తుండగా ఇంటి వెనుక తలుపులు బద్దలు కొట్టి బీరువా, అల్మారాను తెరిచి చోరీ చేశారు. 8 తులాల బంగారు, రూ.70వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

- జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

రాయచోటిటౌన్, జూలై 11: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలనువినియోగంలోకి తీసుకువచ్చి సందపను సృష్టించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఆమె రాయచోటి మండల పరిధిలోని వరిగ పాపిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాలను తప్పనిసరిగా వినియోగంలోకి తీసుకు రావాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రాయచోటి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, సీఆర్ఎస్ కాప్, చెత్త సందప తయారీ కేంద్రాల నిర్వహణ, పన్నుల రాబడి తదితర అంశాలపై సమీక్షించి పంచాయతీ కార్యదర్శులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేంద్రబాబు, ఈవోపీఆర్‌డీ సురేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన అవసరం

- పేదరిక నిర్మూలనకు జనాభా నియంత్రణ కీలకం
- కలెక్టర్ శ్రీధర్ చామకూరి


జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

రాయచోటిటౌన్, జూలై 11: జనాభా నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, పేదరిక నిర్మూలనకు జనాభా నియంత్రణ కీలకమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం రాయచోటి ప్రాంతీయ వైద్యశాలలో, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు రేసిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక జనాభా వల్ల వచ్చే సమస్యలు, చిన్న కుటుంబాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచ జనాభా దాదాపు 800 కోట్లు, భారతదేశ జనాభా దాదాపు 144 కోట్లు, ఆంధరప్రదేశ్ జనాభా 5 కోట్లకుపైగా ఉందని, ఈ సందర్భంగా తెలిపారు. జనాభా పెరుగుదల వల్ల నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగి పేదిరికం ఏర్పడే అవకాశం ఉందన్నారు. జనాభా పెరుగుదలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఆడపిల్లల వివాహానికి కనీస వయస్సు 21 సంవత్సరాలు ఉండేలా చూసుకోవాలన్నారు. జనాభా నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ మంచి పురోగతి సాధించిందని, సంతాన ఉత్పత్తి రేటును 1.6కు తగ్గించగలిగిందన్నారు. దీన్ని ఇలాగే కొనసాగించాలని ఆకాక్షించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య, డీసీహెచ్‌వో డేవిడ్ సుకుమార్, రాయచోటి ప్రాంతీయ వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వేసెక్టమి సర్జన్‌గా డాక్టర్ సానె శేఖర్


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సానె శేఖర్

పుల్లంపేట, జూలై 11: పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ సానె శేఖర్ అన్నమయ్య జిల్లా ఉత్తమ వేసెక్టమి సర్జన్‌గా అవార్డు అందుకున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా గురువారం రాయచోటిలో ప్రశంసాపత్రాన్ని, క్యాష్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పుల్లంపేట ప్రభుత్వ వైద్యు లు మనోజ్‌చంద్ర, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టరు చొరవతో తాళాలు తొలగింపు


ఫర్నీచర్, కంప్యూటర్లను తరలిస్తున్న దృశ్యం

బి.కోడూరు, జూలై 11: కలెక్టర్ చొరవతో మున్నెల్లి సచివాలయం తాళాలు తెరిపించి ఫర్నీచర్‌ను కొత్త సచివాలయానికి తరలించారు. గతంలో మున్నెల్లి సచివాలయం అద్దె భవనంలో ఉండేది. ప్రస్తుతం కొత్త సచివాలయం పూర్తయినందున కంప్యూటర్లు, రికార్డులు, ఫర్నీచర్ అద్దె భవనం నుంచి తీసుకెళ్లేందుకు రాగా సచివాలయ అద్దె భవనయజమాని, ఎంపీటీసీ మాధవరెడ్డి తనకు పూర్తిగా అద్దె చెల్లించి తీసుకెళ్లాలని ఖరాఖండిగా తెలిపారు. దీంతో సర్పంచ్ కలెక్టరుకు ఫిర్యాదు చేయగా ఈ రోజు సాయంత్రానికల్లా ఫర్నీచరు, కంప్యూటరు రికార్డులను కొత్త సచివాలయానికి తరలించాలని కలెక్టరు ఎంపీడీఓ భాస్కర్‌రావును ఫోను ద్వారా ఆదేశించారు. దీంతో ఎంపీడీఓ పోలీసుల సాయంతో తాళాన్ని తొలగించి అక్కడున్న ఫర్నీచర్ తదితర సామగ్రిని కొత్త సచివాలయానికి తరలించారు. అద్దె భవన యజమానికి మీ బాడుగ పూర్తిగా చెల్లించేందుకు బిల్లు పెట్టామని అది వచ్చిన వెంటనే మీ డబ్బు మొత్తం చెల్లిస్తామని తెలిపారు.

పులివెందులలో ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

పులివెందుల టౌన్, జూలై 11: పట్టణంలోని నగరిగుట్ట సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాల య్యాయి. పోలీసుల వివరాల మేరకు... నగరిగుట్ట సమీపంలో అబ్దుల్, అతని మామ కుళాయప్పపై శ్రీను, సంజీవ్, ఫయాజ్, సంపత్‌లు దాడి చేశారన్నారు. రాజేష్ అనే వ్యక్తి వెంట అబ్దుల్ తిరుగుతున్నాడనే ఉద్దేశ్యంతో ఈ దాడి జరిగిందన్నారు. ఈ దాడి లో అబ్దుల్, కుళాయప్పలు గాయపడగా.. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

450 చౌక బియ్యం బస్తాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న చౌక బియ్యం బస్తాలతో పోలీసులు

చెన్నూరు, జూలై 11: మండలంలోని శివాలపల్లె, చెన్నూరులో బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన గోడౌన్లపై సీఐ నారాయణయాదవ్ తన సిబ్బందితో గురువారం దాడులు చేశారు. ఈ దాడుల్లో శివాలపల్లె పంచాయతీ పరిధిలోని బ్రహ్మయ్య గోడౌన్‌లో 250 బస్తాలు, చెన్నూరు కొత్తరోడ్డు ప్రాంతంలో నాగిరెడ్డి గోడౌన్‌లో 150 బస్తాల చౌక బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు చౌకబియ్యం అక్రమ నిల్వల గోడౌన్లపై దాడులు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల చాలా వరకు అక్రమంగా నిల్వ ఉంచిన చౌక బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యం పక్కదారి పట్టడంతో ఈ చౌకబియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి.. నిరంతరం దాడులు చేస్తున్నామని తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐలు ఆంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వలో పసికందు శవం

ప్రొద్దుటూరు క్రైం, జూలై 11: పట్టణంలోని మడూరు కాల్వలో అప్పుడే పుట్టిన పసికందు శవం బయటపడింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మున్సిపల్ అధికారులు సిబ్బందితో అక్కడికి చేరుకుని శిశువు మృతదేహన్ని బయటికి తీశారు. గుర్తు తెలియని వ్యక్తులు శిశువు మృతదేహన్ని మూడు రోజుల క్రితం కాల్వలో పడేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పోట్లదుర్తిలో భారీ ఏర్పాట్లు

- అనకాపల్లి ఎంపీగా అఖండ విజయం
- మొదటిసారిగా సీఎం రమేష్ పోట్లదుర్తికి
- ఏడువేల మందికి భోజనాలు
- వేయి వాహనాలతో భారీ ర్యాలీ

ఎర్రగుంట్ల, జూలై 11: పోట్లదుర్తిలో సందడి వాతావరణం నెలకొంది. సీఎం రమేష్ అనకాపల్లి పార్లమెంటు సభ్యుడిగా భారీ మెజార్టీతో గెలుపొంది స్వగ్రామం పోట్లదుర్తికి మొదటిసారిగాతి శుక్రవారం వస్తుండడంతో ఆయనకు స్వాగతం పలికేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన సోదరుడు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దగ్గరుండి అన్ని పనులు చక్కబెడుతున్నారు. ర్యాలీ విజయవంతం చేసేందుకు జిల్లా నలమూలల నుంచి ప్రజాప్రతి నిధులు, ఎన్డీయే కూటమి నేతలకు ఆహ్వానం పంపుతున్నారు. కడప ఎయిర్‌పోర్టు నుంచి పోట్లదుర్తి వరకు భారీగా సాగే ఈ ర్యాలీలో సుమారు వెయ్యి వాహనాలు పాల్గొంటున్నట్లు సీఎం సురేష్‌నాయుడు ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం పోట్లదుర్తిలోని వేర్‌హౌస్ వద్ద సుమారు 7వేల మందికి భోజనాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఈపనులను సీఎం.సురేష్ నాయుడు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. పోట్లదుర్తిలో సీఎం రమేష్‌కు స్వాగతం పలికేందుకు భారీగా ఫ్లెక్సీలను దారిపొడవునా ఏర్పాటు చేశారు. కాన్వాయ్‌లో పాల్గొనే వీవీపీలు, రాష్ట్ర, జాతీయ నేతలకు భారీ స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. ఏడు జిల్లాలు దాటి ఉత్తరాంధ్రలో భారీమెజార్టీతో గెలుపొందడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి జెండాలు రెపరెపలాడుతున్నాయి. మొదటిసారిగా ఆయన తన స్వగ్రామానికి వస్తుండడంతో భారీగా స్వాగత ఏర్పాట్లు చేశారు.


పోట్లదుర్తి గామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు


భారీగా ఏర్పాటు చేసిన పందిళ్లు... భోజనాలకు సిద్ధం చేస్తున్న దృశ్యం

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు తప్పవు

రామాపురం, జూలై 11: మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాగులు, వంకలు, గుట్టలు, చెరువులు, కుంటలు, ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సిద్దేరరావు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3,37,806

సంబేపల్లె, జూలై 11: సంబేపల్లె దేవరరాయి నల్లగంగమ్మ దేవస్థానం నుంచి రూ.3,37,806 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కొండారెడ్డి, తనిఖీ అధికారి రవి తెలిపారు. గురువారం నుంచి లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. హుండీ ద్వారా వచ్చిన నగదు రూ.3,37,806 మొత్తం దేవస్థానం ఖాతాలో ఈవో కొండారెడ్డి, పోలీసు సిబ్బంది, బ్యాంకు సిబ్బంది ఆధ్వర్యంలో జమ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, మట్లి వేణుగోపాల్, పోలు సురేంద్ర, వెంకట్రమణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కాపునాడు కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం


నియామకపు పత్రాన్ని తీసుకుంటున్న దృశ్యం

రైల్వేకోడూరు, జూలై 11: రాష్ట్ర కాపునాడు కార్యదర్శిగా కటికం సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు వీపీ నారాయణస్వామిరాయల్ చేతుల మీదుగా గురువారం హైదరాబాద్‌లో నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాపు, బలిజ, ఒంటరి, తూర్పు కాపు తదితరులు వెనకబడి ఉన్నారన్నారు. నియోజకవర్గంలో కాపులందరి సహకారంతో వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కాగా తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

సంబేపల్లె, జూలై 11: బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని మండల విద్యాశాఖ అధికారులు రమాదేవి, శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా ప్రవేశ పరీక్ష నిర్వహణ కార్యక్రమంలో భాగంగా బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని నినాదాలు వేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు నాయక్, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ముగ్గురు విద్యార్థినులకు చోటు



ఎస్.జయభా, ఆర్.ప్రణతి, పి.వాహిద

రాజంపేటటౌన్, జూలై 11: రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీలో స్థానం లభించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మీ తెలిపారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఎస్.జయభా, ఆర్.ప్రణతి, పి.వాహిద అనే విద్యార్థులు పాసై మండల టాపర్లుగా నిలిచి ఉత్తమ మార్కులు సాధించడంతో న్యూజివీడులో ఇద్దరికి, ఇడుపులపాయ ఆర్‌కె వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఒకరికి సీటు లభించిందన్నారు.

సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె, జూలై 11: మామిడిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చని ఉద్యానవనశాఖ అధికారి నాగమణి పేర్కొన్నారు. గురువారం బి.యర్రగుడి గ్రామంలోని మామిడి తోటలను పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. మామిడిలో కాయలు కోసినప్పటి నుంచి తగు జాగ్రత్తలు పాటిస్తే నాణ్యతతో కూడిన దిగుబడులు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, హరిత, ఓంసుధ, మామిడి రైతులు పాల్గొన్నారు.


పిచ్చి మొక్కలతో నిండిపోయిన మాలేమార్పురం చెరువు


మధ్యలో ఆగిపోయిన యల్లమరాజు చెరువు మొండికట్ట పనులు


అనుంపల్లె వంతెన నిర్మాణం చేపట్టాలని నిరసన తెల్పుతున్న మండల వాసులు (ఫైల్)


నూతన ప్రభుత్వంపై ఆశలు..

తీరేనా సమస్యలు

చిట్వేలి, జూలై 11: ఎన్నో ఆశలతో రాష్ట్రంలో నూతన ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారు. నియోజకవర్గం విషయానికొస్తే చరిత్రను తిరగరాస్తూ 2004 నుంచి టీడీపీకి అందని ద్రాక్షలా ఉన్న గెలుపును కూటమి ప్రభుత్వం సొంతం చేసుకుంది. ప్రభుత్వం కొలువుదీరి నెలరోజులు కావస్తోంది. ఈ సందర్భంగా చిట్వేలి మండల వ్యాప్తంగా సుదీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు బోలెడు ఉన్నాయి. ఇవన్నీ పరిష్కారం అవుతాయన్న ఆశలో ప్రజలు ఉన్నారు. సాధారణంగా ఒక నియోజకవర్గంలో ప్రతిపక్షం నుంచి ఎమ్మెల్యే ఉంటే అధికార పక్షం పార్టీ ఇన్‌చార్జిని నియమించి వారి ద్వారా పరిపాలన సాగించడం పరిపాటి. ప్రస్తుతం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఇరువురు కూటమికి చెందినవారూ.. పైగా ఒకే గ్రామానికి చెందినవారు కావడంతో మండల వాసుల అంచనాలు భారీగా పెరిగాయి. ఇక మండలం అభివృద్ధి దిశలో పయనిస్తుందని ఆశిస్తున్నారు.


వరదలకు కొట్టుకుపోయిన రాచపల్లె వంతెన

ముఖ్యంగా మండలంలో యల్లమరాజు చెరువు, మధ్యలో ఆగిపోయిన మొండికట్ట నిర్మాణం పూర్తి, గొట్టిమానుకోన పునర్నిర్మాణం, ఆంగ్లకాలంలో రూపుదిద్దుకుని లోపభూయిష్టమైన నిర్మాణంతో ఉపయోగకరంలేని ప్రాజెక్టును తిరిగి రూపకల్పన చేయడం, రాజుగుంట యల్లమరాజు చెరువుకు సోమశిల వెనుకజలాల నుంచి మోటార్ల ద్వారా కానీ, కాలువల ద్వారా కానీ నీరు అందించడం ప్రధానంగా అవసరం. ఒకప్పుడు గుంజననదిలో ప్రతి కిలోమీటరుకు ఒక చెక్‌డ్యాం నిర్మించడం దివంగత కట్టా నారాయణయ్యనాయుడు కల. దీంతో భూగర్భజలాలు పెరుగుతాయని ఆయన ప్రయత్నం. దీనిపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా


మొండిగోడలతో దర్శనమిస్తున్న మల్లెమడుగు

సాంకేతిక విద్య ద్వారా స్వయం ఉపాధి, ఇతర ఉపాధి మార్గాల్లో యువతకు ఉపయోగపడే విధంగా మండలానికి ఒక పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయించాలి. రాజుకుంట క్రాస్, రాచపల్లె, మైలపల్లె గ్రామస్తులకు అలుగు ఉప్పొంగి నప్పుడు ఎదుర్కొంటున్న సమస్యను అధిగమించాలంటే వంకపై వంతెనను నిర్మించాల్సిన అవసరం ఉంది. మల్లెమడుగు నిర్వాసితులకు పరిహారం చెల్లింపుతో పాటు పునరావాసం ఏర్పాటు, క్రీడా మైదానాలు, అనుంపల్లె ఆంజనేయస్వామి ఆలయం వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా అభివృద్ధి జరిగేనా అని పలువురు చర్చించుకుంటున్నారు.

మొక్కల నిర్వహణ పనులు పక్కాగా అమలవ్వాలి

● కలెక్టర్ శ్రీధర్


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

చిన్నమండెం, జూలై 11: మండలంలోని మల్లూరు గ్రామం, బలిజపల్లెలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం పనుల ద్వారా ఎస్సీ, ఎస్టీ, చిన్న, చిన్నకారు రైతుల పొలాల్లో నాటే పండ్ల మొక్కల నిర్వహణ తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ఒక మామిడి చెట్టును నాటి ఉపాధి పనులను ప్రారంభించారు. కూలీలతో కలెక్టర్ మాట్లాడుతూ ఎకరాకు ఎన్ని మామిడి చెట్లు వేస్తున్నారని, సబ్సిడీలో మామిడి మొక్కలు అందుతున్నాయా లేదా, కూలీలకు నిర్దిష్ట సమయంలో వేతనాలు బ్యాంకు ఖాతాల్లో పడుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పని వద్ద తాగు నీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్ వంటివి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో పీడీ మద్దిలేటి, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, డ్వామా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకపై వైసీపీ తప్పుడు ప్రచారం

● మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు

వీరబల్లి, జూలై 11: టీడీపీ ప్రభుత్వం అందరికీ ఆమోదయోగ్యంగా ఇసుకను ఉచితంగా సరఫరా చేసి నిర్మాణ రంగానికి వెన్నుదన్నుగా నిలవాలని నిర్ణయించడం వైసీపీ జీర్ణించుకోలేకపోతుందని వీరబల్లి టీడీపీ మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు విమర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇసుకను వ్యాపారంగా మార్చి మరోవైపు అక్రమంగా తరలించి వేలాది కోట్లను వైసీపీ పెద్దలు స్వాహా చేశారని ఆరోపించారు. కేవలం ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలకు పైగా దోపిడీ చేశారన్నారు. తమ ప్రభుత్వం ఇసుక సరఫరాలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి ఆదాయాన్ని ఆశించకుండా సరఫరా చేసి నిర్మాణ రంగానికి తోడ్పాటునందిస్తుంటే వైసీపీ మూకలకు నిద్ర పట్టడం లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులరెడ్డి, శైలేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పవన్‌కల్యాన్, సందీప్‌కుమార్‌రెడ్డి, వినయ్, రమణ, మహమ్మద్‌రఫీ, గంగయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం చొరవ చూపాలి

రైల్వేకోడూరు(రూరల్), జూలై 11: విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం చొరవ చూపాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్ జాబీర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం పేరుతో గత ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలకు తరలించిన కారణంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిందన్నారు. ఇటువంటి జీఓ 117ను రద్దు చేయాలని కోరారు. కేజీబీవీ పాఠశాలలో ప్లస్ టూ తరగతులకు ఇంగ్లీషు, తెలుగు బోధించేందుకు వీలు లేకుండా తొలగించిన టీచర్లను కోర్టు ఉత్తర్వుల ప్రకారం తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎన్.మనోహర్, సీనియర్ నాయకులు లక్ష్మీకుమార్, శివశంకర్‌రెడ్డి, ఫణీంద్రయాదవ్, వెంకటేశ్వర్లు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటాం

నందలూరు, జూలై 11: టీడీపీ కార్యకర్తలకు సుగవాసి కుటుంబం అందుబాటులో ఉంటుందని, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. నందలూరు, రాజంపేట టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు గురువారం రాయచోటిలోని సుగవాసి ప్రసాద్‌బాబు స్వగృహంలో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. ప్రసాద్‌బాబు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి ఉంటే రాజంపేటలో టీడీపీ విజయం సాధించి ఉండేదన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా తాము ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, రాజంపేట మండలం గుండ్లూరు మాజీ సర్పంచ్ మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్, అగస్త్యేశ్వర అన్నపూర్ణేశ్వరి ఆలయ మాజీ చైర్మన్ చెంగల్‌రెడ్డి, టీడీపీ నాయకులు షేక్ మౌల, పవన్‌కుమార్, చింటు యాదవ్, తుమ్మది శివకుమార్, బాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

అధిక జనాభాతో అభివృద్ధికి ఆటంకం

గాలివీడు, జూలై 11: అధిక జనాభాతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని వైద్యాధికారిణి స్రవంతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంఈవో నాగరాజుతో కలిసి అంతర్జాతీయ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దేవేంద్రారెడ్డి, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పొలాల పరిశీలన

చిన్నమండెం, జూలై 11: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీలో గురువారం జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కోత దశలో వేరుశనగ పంట ఉన్నప్పుడు ఎకరానికి 200 కేజీలు జిప్సం వేయాలని, దీనివల్ల కాయల్లో నూనెశాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఏడీఏ శ్రీలత, ఏవో గీత, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడిని కలిసిన బీజేపీ నాయకులు


అచ్చెన్నాయుడిని సత్కరించిన బీజేపీ నాయకులు

రైల్వేకోడూరు, జూలై 11: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడును విజయవాడలోని ఆయన స్వగృహంలో గురువారం రైల్వేకోడూరు బీజేపీ నాయకులు, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు లింగం ప్రభాకర్, బీజేపీ సీనియర్ నాయకులు చంగల్‌రెడ్డి, ఊటుకూరు చలపతిలు కలిశారు. రైల్వేకోడూరులో రాజకీయ పరిస్థితులు తదితర విషయాలపై చర్చించారు. రైల్వేకోడూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరామని తెలిపారు. అదే విధంగా రాజంపేట అన్నమయ్య ప్రాజెక్టును మళ్లీ నిర్మించాలని కోరామని తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అనంతరం మంత్రిని ఘనంగా సత్కరించారు.

అంగన్వాడీలు సమయపాలన పాటించాలి

చిట్వేలి, జూలై 11: అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమయపాలన పాటించాలని, లేకుంటే కఠినచర్యలు తప్పవని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శశికళ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీపీ సభా భవనంలో జరిగిన ప్రాజెక్టు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లీ, పిల్లల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే అంగన్వాడీలు పిల్లల సంరక్షణ కోసం గర్భవతులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా పోషకాహారాన్ని సకాలంలో అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామని, వర్కర్లు, హెల్పర్లు సమయపాలన పాటించాలన్నారు. అనంతరం చిట్వేలి ప్రాజెక్టు సీడీపీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో పోషన్ అభియాన్‌లో భాగంగా మంజూరైన 25 అంగన్వాడీ కేంద్రాలకు ఆర్వో వాటర్, నీళ్ల డ్రమ్ము, న్యూట్రీ గార్డెన్, రైన్ వాటర్ హార్వెస్టింగ్, ఎల్ఈడీ టీవీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో నాగరాజు, జిల్లా ప్రాజెక్టు సమన్వయకర్త సైపుల్లా, చిట్వేలి ప్రాజెక్టు సూపర్‌వైజర్లు వసుంధరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, సురేఖరాణి, బీపీపీ ధనలక్ష్మీ, అంగన్వాడీ వర్కర్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ సమస్యలపై పంతగాని ఆరా


హాస్టల్‌లోని సెప్టిక్ ట్యాంకును పరిశీలిస్తున్న పంతగాని

రైల్వేకోడూరు, జూలై 11: పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను బుధవారం టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ పరిశీలించారు. అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. గురువారం తన సొంత నిధులతో సెప్టిక్ ట్యాంకును శుభ్రం చేయించారు. అంతేకాకుండా విద్యార్థులు రాత్రి వేళల్లో దోమల బారిన పడకుండా మెష్ కొట్టించారు. వచ్చే నెల 17 లోపు హాస్టల్ రూపురేఖలను మార్చుతామన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, దుప్పట్లు, కాస్మెటిక్ చార్జీలు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, హాస్టళ్ల పరిస్థితిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాగా నరసింహ ప్రసాద్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్డీవోకు భవన నిర్మాణ కార్మికుల వినతి

రాజంపేటటౌన్, జూలై 11: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజంపేట ఆర్డీవో మోహన్‌రావుకు భవన నిర్మాణ కార్మికులు విజ్ఞప్తి చేశారు. 70 రోజులుగా ఇసుక సరఫరా ఆగిపోవడం వల్ల భవన నిర్మాణాలు ఆగిపోయి కార్మికులంతా పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 45 కి.మీ. దూరంలోని ఇసుకను ట్రాక్టర్ రూ.7 వేలు పెట్టి భవన నిర్మాణ యజమానులు ఇసుక కొనుగోలు చేయలేకపోతున్నారన్నారు. రాజంపేటలో ఇప్పటివరకు ఇసుక డంపింగ్ లేనందున భవన నిర్మాణ పనులు లేక వేలాది మంది కార్మికులు పూటగడవని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. కావున ఇసుకను వెంటనే సరఫరా చేసి ఆదుకోవాలని ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్డీవో వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గాలి చంద్రయ్య, ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరి ఎంఎస్ రాయుడు, మహ్మద్‌హుస్సేన్, నరసింహ, సుబ్రమణ్యం, రమణ, జయరాం, శ్రీనివాసులు, జమాల్‌బాషా, రమణ, వెంకటస్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

రాజంపేట, జూలై 11: రాజంపేట లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా సంగరాజు నరసింహరాజు, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా నరసింహ, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్‌లు రవికుమార్, చిన్నపరెడ్డి, చంద్రప్రకాష్‌లు నూతన కమిటీ సభ్యులచేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ రమేష్‌నాయుడు, లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు నాగేశ్వరరావు, టి.లక్ష్మీనారాయణ, అబ్దుల్లా, బాలరాజు, డాక్టర్ నవీన్‌కుమార్, వై.నరసింహరాజు, రీజనల్ చైర్మన్ వెంకటరమణ, రామచంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారం వాయిదా

ఓబులవారిపల్లె, జూలై 11: ఏపీఎండీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు గత కొన్నిరోజుల కిందట వినతిపత్రం అందించారు. అయితే ఈ సమస్య పరిష్కారాన్ని ఆగస్టు 21కి వాయిదా వేసినట్లు ఏపీఎండీసీ పోరాట కమిటీ జేఏసీ కన్వీనర్ వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరి మర్రి శంకరయ్య, పోరాట యూనియన్ పబ్లిసిటీ సెక్రటరి వీపీఎస్ రాజావర్మ, ఏపీఎండీసీ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరి జ్యోతి నాగరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆట'విడుపు!



బ్యాట్ ఝుళిపిస్తున్న కలెక్టర్ - బంతిని టార్గెట్ చేసిన ఎమ్మెల్సీ

కుప్పం, జూలై 11: ఒకరు జిల్లా పరిపాలనా వ్యవహారాల్లో తలమునకలైన అధికారి. మరొకరు ఇటు పరిపాలన, అటు రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నమైన ప్రజాప్రతినిధి. వారిద్దరికీ కాస్త ఆటవిడుపు లభించింది. అవకాశం వెదక్కుంటూ రావడం కాదు.. వాళ్లే దాని దగ్గరికి వెళ్లిపోయారు. క్రికెట్ ఆడుతున్న యువతరాన్ని చూసి తమ హోదాలను మరచిపోయి సరదాగా బ్యాట్ ఝుళిపించారు. వారే కలెక్టరు సుమిత్‌కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్. గురువారం కుప్పం మండలం కృష్ణదాసనపల్లె వద్ద కేంద్రీయ విద్యాలయంకోసం స్థల పరిశీలన జరిపి వస్తున్నప్పుడు జరుగు గ్రామ సమీపంలోని మైదానంలో కొందరు యువకులు క్రికెట్ ఆడుతూ కనిపించారు. వారిని చూసి వీరూ టీనేజీ యువకులైపోయారు. తమ వాహనాలు దిగి ఒకరితర్వాత ఒకరుగా క్రికెట్ బ్యాట్‌లు పట్టుకుని బంతిని బౌండరీకి పరుగులు తీయించారు. యువత క్రీడల్లో రాణించడానికి అనువైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. దీనికోసం కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. పంచాయతీ కేంద్రాల్లోనూ క్రీడా మైదానాల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు.

మరింత తక్కువ ధరకు నిత్యావసరాలు



రైతు బజార్లో బియ్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్వో శంకరన్

చిత్తూరు (సెంట్రల్), జూలై 11: రైతు బజార్లో మరింత తక్కువ ధరకు నిత్యావసర సరుకులు విక్రయించనున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్వో) శంకరన్ తెలిపారు. గురువారం రైతు బజార్లో మార్కెటింగ్ ఏడీ పరమేశ్వర్‌తో కలిసి బియ్యం కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కిలో కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.190 నుంచి రూ.200, బియ్యం రూ.52 నుంచి రూ.58 వరకు పలుకుతున్నాయని తెలిపారు. రైతు బజారుతో పాటు జిల్లాలోని పలు ప్రొవిజన్స్ స్టోర్స్‌లో కిలో కందిపప్పు రూ.160, బియ్యం రూ.49లకు అందుబాటులో తెచ్చామన్నారు. చిత్తూరు రైతు బజార్లో (బియ్యం, కందిపప్పు), వినాయక స్టోర్స్‌లో (కందిపప్పు), కృష్ణమూర్తి అండ్ సన్స్‌లో (బియ్యం), హైరోడ్డులోని గుప్తాలో (బియ్యం), బజారు వీధిలోని శ్రీబాలాజీ ట్రేడర్స్‌లో (బియ్యం), పుంగనూరు ప్రభు ఇండస్ట్రీస్, ట్రేడర్స్‌లో (కందిపప్పు), కల్లూరు ఎఫ్ఎంఎస్ ట్రేడర్స్‌లో (కందిపప్పు) అందుబాటులోకి తెచ్చామన్నారు.

పొలాలకు దారి మూసేస్తారా?

● ఆరడిగుంట వద్ద రైతుల నిరసన



పొలాల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పుంగనూరు, జూలై11: వందేళ్లుగా వ్యవసాయ పొలాలకు ఉన్న దారిని శ్రీకాళహస్తి పైపుల ఫ్యాక్టరీ యాజమాన్యం మూసివేసి ఇబ్బందులు పెట్టడం దారుణమని బాధిత రైతులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం పుంగనూరు మండలం ఆరడిగుంట వద్ద పరిశ్రమలకు గత ప్రభుత్వం కేటాయించిన భూముల్లో దారిలేకుండా ట్రెంచ్ తీసిన ప్రాంతంలో వీరు ఆందోళనకు దిగారు. గత ప్రభుత్వంలో భూములు పరిశ్రమకు ఇచ్చారని, ఆ సమయంలో పొలాలకు వెళ్లేందుకు రైతులకు దారి ఇస్తామని చెప్పి ప్రస్తుతం మాటతప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పొలాల్లో పండించిన పంటలను పట్టణానికి తరలించాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. ఈ విషయాన్ని ఈనెల నాలుగోతేది తహసీల్దార్ శివయ్యకు టీడీపీ నేతల ద్వారా ఫిర్యాదులుచేయగా అధికారులు పరిశీలించి ఫ్యాక్టరీయజమాన్యంతో మాట్లాడి రైతులకు దారి ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం దారి ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేయడం సరికాదన్నారు. తమపై కక్షసాధింపు చర్యలకు పాల్పడితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, వెంటనే దారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళతామని సెక్యూరిటీ సిబ్బంది రైతులతో చెప్పారు.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు రూరల్, జూలై 11: అగ్నివీర్ పథకంలో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఫిజిక్స్, మ్యాథ్స్‌లో 50 శాతం మార్కులు లేదా మూడు సంవత్సరాల ఇంజినీరింగ్ డిప్లమా విద్యార్హత ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. https://agnipath-vayyu.cdac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కుప్పంలో అదనపు మండలాల ఏర్పాటుకు కమిటీ నియామకం

కుప్పం, జూలై 11: కుప్పం రెవెన్యూ డివిజన్‌లో అదనంగా రెండు మండలాల ఏర్పాటుపై అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీ వేసింది. పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ కె.కన్నబాబు జీవో నెంబర్ 485 విడుదల చేశారు. ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్‌గా చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్, పంచాయతీరాజ్ కమిషనర్ చిత్తూరు జిల్లా కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. శాంతిపురం మండలం నుంచి రాళ్లబూదుగూరు, కుప్పం మండలం నుంచి మల్లనూరును విడదీసి రెండు ప్రత్యేక మండలాలుగా ఏర్పాటు చేయడానికి గల సాధ్యా సాధ్యాలను ఈ కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుంది.

రోడ్డు ప్రమాదంలో సర్పంచి దుర్మరణం



తులసిప్రసాద్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

ఐరాల, జూలై 11: ఐరాల మండలం ఎర్రేపల్లె సర్పంచ్ తులసిప్రసాద్‌రెడ్డి(48) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన ప్రకారం.. తన సొంత పని నిమిత్తం సర్పంచ్ తులసిప్రసాద్‌రెడ్డి చిత్తూరు వెళ్లి బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. 45కొత్తపల్లె వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రి 11 గంటలు అవుతున్నా తులసిప్రసాద్‌రెడ్డి ఇంటికి రాకపోవడం.. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ అయి ఉండటంతో అతడ బంధువులు వెతుకుతూ వచ్చారు. రోడ్డుపై పడి ఉన్న అతడ్ని చూసి హుటాహుటినా చీలాపల్లె సీఎంసీకి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతదేహానికి గురువారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

4 నుంచి 11వ తేదీవరకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

తిరుపతి(సెంట్రల్), జూలై 11: కడప-తిరుపతి-విశాఖపట్టణం మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ (17487-17488)ను ఆగస్టు నాలుగు నుంచి 11వ తేదీవరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ-విశాఖపట్టణం మధ్య ఆటోమేటిక్ సిగ్నల్ పనులు జరుగుతున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

వైసీపీ ఆక్రమణల నుంచి ఆలయ భూమికి విముక్తి

ఆలయ స్థలంగా అధికారుల గుర్తింపు ● శుభ్రం చేయించిన వీరశైవలింగాయత్‌లు



పుంగనూరు భోగనంజుండేశ్వరస్వామి ఆలయం



ఆలయ స్థలాన్ని శుభ్రం చేస్తున్న ఎక్స్‌కవేటరు

పుంగనూరు, జూలై 11: పుంగనూరు భోగనంజుండేశ్వరస్వామి ఆలయ భూమికి వైసీపీ నేతల ఆక్రమణల నుంచి గురువారం విముక్తి లభించింది. పట్టణ నడిబొడ్డున.. ఆలయం పక్కనే ఉన్న ఈ అత్యంత విలువైన స్థలంపై వైసీపీ కన్నుపడింది. మేలుపట్ల రెవెన్యూ గ్రామంలోని సర్వేనెంబరు 115-13లో 22సెంట్లు స్థలం దేవుడికి చెందిన ఆలయ భూమిగా గుర్తించి అమ్మడం, కొనడం చెల్లదని ఖాతానెంబరు 600009లో ప్రభుత్వ రికార్డుల్లో పొందుపరిచి 22ఏ నిషేధిత జాబితాలో నమోదైంది. ఆలయాన్ని 1999లో దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోగా, ఆలయం తమదేనని 2000 సంవత్సరంలో మదనపల్లె ఏడీజే కోర్టులో కేసు దాఖలు చేయగా 2005లో కోర్టు ఫౌండర్ ట్రస్టీగా నాగరాజస్వామి కుటుంబీకులనే ప్రకటించింది. తర్వాత మళ్లీ ఎండోమెంట్ అధికారులు ఆలయం దేవదాయశాఖదేనని కోర్టులో కేసు వేయగా గత ఏడాది జూలైలో.. ఆ దేవాలయం దేవదాయశాఖకు చెందినదేనని తీర్పు రావడంతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒక హోటల్, ఇళ్లు ఉన్న స్థలాన్ని కొంతకాలం క్రితం ఖాళీచేయించి ఇటీవల ఆలయం పక్కనే ఉన్న విలువైన స్థలం ఆలయానికి సంబంధించినది కాదని ప్రైవేటు భూమి అంటూ యథేచ్ఛగా ఎక్సకవేటర్‌తో శుభ్రం చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. వైసీపీ ముఖ్యనేతల జోక్యంతో ఆలయ భూమి 115/3లోని 22 సెంట్లు భూమిని సర్వేనెంబరు 115/2గా ముస్లిం వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయించి స్థలాన్ని అప్పగించారు. దీనికి సంబంధించి అభ్యంతరాలున్నా మున్సిపల్ అధికారులు ప్లాన్ అప్రువల్ చేశారు. ఈ ఆక్రమణలపై గతేడాది ఏప్రిల్ 8వ తేది 'భోగనంజుండేశ్వరుడి భూమికే ఎసరు, కబ్జాకోరల్లో రూ.కోట్ల విలువైన స్థలం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. అప్పుడు వైసీపీ ప్రభుత్వం ఉండటం వల్ల ఆ పార్టీ నాయకుల ఆదేశాలతో మున్సిపల్, రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా సర్వే చేశారు. విషయాన్ని తేల్చకుండా కాలయాపన చేశారు. గతంలోనే వీరశైవలింగాయత్ కులస్తులు, మరికొందరు భక్తులు, ఆలయ అధికారులు ఈ భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని అభ్యర్థించినా ఏమీ చేయలేక పోయారు. కాగా, సర్వే చేసి ఆలయ భూమికి హద్దులు చూపాలని గ్రూప్‌టెంపుల్స్ ఈవో కమలాకర్ తహసీల్దారును కోరారు. దీనిపై సర్వేయర్ కిరణ్మయి సర్వే చేసి ఎస్ఎల్ఆర్, ఇతర రికార్డుల ప్రకారం ఆలయ భూమిగా గుర్తించారు. ఈవో కమలాకర్ 115/3 సర్వేనెంబరు 22సెంట్లు స్థలం ఆలయానిదని, ఈస్థలంపై మున్సిపల్ అధికారులు మంజూరు చేసిన ప్లాన్ అప్రువల్ రద్దు చేయాలని లేఖపంపారు. స్థానిక వీరశైవలింగాయత్ కులస్తులు ఆక్రమణ స్థలాన్ని ఎక్సకవేటర్‌తో శుభ్రం చేయించి మట్టి నింపుతున్నారు. కానీ ఆలయ ఈవో కమలాకర్ ఆలయం వద్ద లేకుండా, ఫోన్‌కు అందుబాటులో లేరు. ఎట్టకేలకే వైసీపీ చెర నుంచి దేవుడి భూమి ఆలయానికి చెందినదిగా తేలడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లకు బ్రేక్

జిల్లావ్యాప్తంగా పనిచేయని సర్వర్లు

ఈసీఈలకు తప్పని తిప్పలు



రిజిస్ట్రేషన్ కోసం వేచివున్న ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 11: జిల్లావ్యాప్తంగా గురువారం రిజిస్ట్రేషన్లకు బ్రేక్ పడింది. సర్వర్ పనిచేయకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన పలువురు సాయంత్రం వరకు పడిగాపులు కాచి, వెనుదిరగాల్సి వచ్చింది. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఫలితంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. ఈసీ రాలేదు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో సాంకేతిక కారణాలతో సమస్య ఏర్పడిందని అధికారులు ప్రకటించారు. గత ప్రభుత్వం దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చింది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమస్యలు ప్రారంభమయ్యాయి. ఈసీల జారీకి కూడా ఇదే సాఫ్ట్‌వేర్‌ను కొనసాగించడంతో సమస్య మరీ తీవ్రమైంది. గతంలో ఉన్న 1.0 ఫార్మెట్‌లో డాక్యుమెంట్ నెంబరు నమోదు చేయగానే ఈసీలు వచ్చేవి. 2.0 సాఫ్ట్‌వేర్‌కు మారిన తర్వాత ఈసీ పొందడం కష్టతరమైంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది. భూములు, స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు పెరుగుతున్నాయి. అయితే కార్యాలయాల్లో సక్రమంగా రిజిస్ట్రేషన్లు జరక్కపోవడంతో జిల్లాలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది.

సమస్యను పరిష్కరిస్తున్నాం..

సర్వర్ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశాం. సాంకేతిక కారణాలతోనే జిల్లా అంతటా ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరక్కపోవడం నిజమే. శుక్రవారం నుంచి సర్వర్ పనిచేస్తుంది.

- శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్, చిత్తూరు

నగరిలో అత్యధిక వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 11: జిల్లావ్యాప్తంగా గడచిన 24 గంటల్లో 21 మండలాల్లో తేలికపాటి నుంచి అధిక వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నగరిలో 62.8మి.మీ., అత్యల్పంగా బైరెడ్డిపల్లిలో 0.8 వర్షం కురిసింది. శ్రీరంగరాజపురం 60.2, విజయపురం 42.6, కార్వేటినగరం 40.8, యాదమరి 38.4, పాలసముద్రం 33.2, గుడిపాల 26.4, నింద్ర 23.4, గంగాధరనెల్లూరు 14.0, పెనుమూరు 10.0, వెదురుకుప్పం 9.4, పూతలపట్టు 9.0, చిత్తూరు అర్బన్ 9.0, బంగారుపాళ్యం 4.8, చిత్తూరు రూరల్ 3.4, ఐరాల 3.2, శాంతిపురం 2.8, గంగవరం 2.6, తవణంపల్లె 2.2, పెద్దపంజాణి 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

కుక్కల దాడిలో జింక మృతి



జింక కళేబరం

గుడిపాల, జూలై 11: మండలంలోని పాపసముద్రం పంచాయతీ అడవిచేను గ్రామంలో గురువారం సాయంత్రం కుక్కల దాడిలో ఓ జింక మృతిచెందింది. గ్రామస్తులు గమనించి, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు రాకపోగా కళేబరాన్ని ఉదయం తీసుకెళతామని, గ్రామంలోనే భద్రంగా ఉంచాలని ఫోన్ ద్వారా చెప్పడం గ్రామస్తులను విస్మయానికి గురిచేసింది.

ట్రిపుల్ ఐటీకి 135 విద్యార్థుల ఎంపిక

చిత్తూరు (సెంట్రల్), జూలై 11: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీకి (ఆర్‌జేయూకేటీ) గురువారం విడుదల చేసిన ప్రవేశ పరీక్షల్లో జిల్లాలోని 135 మంది విద్యార్థులు ఎంపికయారు. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఆర్‌జేయూకేటీకి దరఖాస్తు చేసుకున్నారు. వీరి అర్హతల ఆధారంగా ఫలితాలు విడుదల చేశారు. ఎంపికైన 135 మంది విద్యార్థుల్లో నూజివీడు క్యాంపస్‌కు ఆరుగురు, ఆర్‌కే వ్యాలీకి 103 మంది, ఒంగోలు క్యాంపస్‌కు 17 మంది, శ్రీకాకుళం క్యాంపస్‌కు తొమ్మిది మంది ఎంపికయ్యారు. ఈ నెల 22 నుంచి 27 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనుండగా, ఆగస్టు మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భీమారావు

చిత్తూరు లీగల్, జూలై 11: ద్విచక్ర వాహనాల్లో వెళ్లే ప్రతిఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు కోరారు. గురువారం సాయంత్రం ఆయన జిల్లా కోర్టు ప్రాంగణంలో హెల్మెట్ ధారణ గురించి పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. హెల్మెట్ ధరించని వ్యక్తులు తమ కుటుంబం గురించి ఆలోచించుకోవాలన్నారు. వెనుక ఉన్న వ్యక్తులు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ విషయాలను పోలీసులు గుర్తుంచుకుని, వాహనదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎంవీఐ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

స్థల కేటాయింపుపై కమిషనర్‌కు నోటీసులు

● 15 రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం

చిత్తూరు, జూలై 11: చిత్తూరు నగరపాలక సంస్థ స్థలాన్ని లీజుకు కేటాయించడంలో నిబంధనలను అనుసరించలేదంటూ కమిషనరు జె.అరుణపై క్రమశిక్షణ చర్యలు చేపట్టడానికి ప్రభుత్వం ఆధారాలను సిద్ధం చేసింది. ఈ మేరకు గురువారం ఏపీ పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీచేశారు. కొంగారెడ్డిపల్లి కూరగాయల మార్కెట్‌యార్డులో 2500 అడుగుల నగరపాలక స్థలాన్ని హిమజ గ్యాస్ ఏజెన్సీ యజమాని కిషోర్‌కుమార్ రెడ్డికి నిబంధనలకు విరుద్ధంగా లీజుకు కేటాయించారు. ఈ ప్రక్రియకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించకుండా బాక్స్ టెండర్ ద్వారా కట్టబెట్టడం, ఈ సమాచారాన్ని ప్రభుత్వానికి సక్రమంగా అందించకపోవడం తదితర కారణాలతో ఆమెపై అభియోగం నమోదైనట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆరు రకాల అంశాలకు సంబంధించి విచారణకు ఏర్పాట్లు చేసుకున్నామని, నోటీసు అందుకున్న 15రోజుల్లోపు రాతపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని, లేని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తప్పవని పేర్కొన్నారు.

రంగునీళ్ల సమస్య పరిష్కారానికి కృషి

నగరి టీడీపీ నేతల ఆత్మీయ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ల ● ఇక కమీషన్ల వ్యవహారం ఉండదన్న ఎమ్మెల్యే భాను



టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ ప్రసాదరావు

నగరి జూలై 11: నగరి నియోజకవర్గంలో టెక్స్‌టైల్స్‌పార్కు ఏర్పాటు, రంగునీళ్ల సమస్యపై జిల్లా అధికారులతో ప్రణాళికలను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. నగరిలో గురువారం జరిగిన టీడీపీ ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలకు అవసరమైన నిధులను మంజూరు చేయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మీ ప్రాంతాలలో ఏ పని ముఖ్యమో గుర్తించి అంచనాలను వేయించి ఎమ్మెల్యే ద్వారా తన దృష్టికి తీసుకొస్తే మంజూరుచేయించేలా చర్యలు తీసుకుంటానన్నారు.శ్మశానాలకు సౌకర్యాలు లేక ఇబ్బంది పడటం, డ్రైనేజీ, తాగునీటి సమస్య తదితరాలను గుర్తిస్తే ఎంపీ లాడ్స్ ద్వారా పనులు చేయిద్దామన్నారు. గత ఐదేళ్లలో ఎంపీ లాడ్స్ ఎక్కడ ఖర్చుపెట్టారో తెలియడం లేదన్నారు. పరిశ్రమల స్థాపనకు ఎవరైనా ముందుకొస్తే సహకరిస్తామన్నారు. ఎన్నికల ముందు ఏమి చెప్పానో అదే మాటకు కట్టుబడి కష్టించి పని చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడిని ఆదుకుంటామని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. ఏ చిన్న సమస్యనైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కమీషన్ల వ్యవహారం ఉండదని, ఏపని కావాలన్నా ఎవరికీ రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.మండలాల పార్టీ అధ్యక్షులు రమేష్ బాబు, రమేష్‌రాజు, వెంకటేశ్వరచౌదరి, రవికుమార్, పార్లమెంటరీ అధికారప్రతినిధి చినబాబు, నాయకులు గంజి మాధవయ్య, సురేష్ నాయుడు, రాష్ట్ర టీఎన్‌టీయుసీ కార్యదర్శి బాలాజీ, జిల్లా అధికారప్రతినిధి జ్యోతినాయుడు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా, రాష్ట్ర ఎస్సీసెల్ అధికారప్రతినిధి దశరదవాసు, నేతలు అల్లిముత్తు, ఉమాపతి రాజు, ధనంజయరాజు, కృష్ణారెడ్డి, లక్ష్మీప్రసన్న, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో అక్రమ మద్యం ధ్వంసం



పలమనేరు, జూలై 11: వివిధ కేసుల్లో పట్టుబడిన రూ. 19 లక్షల విలువ చేసే మద్యాన్ని గురువారం పలమనేరులో అధికారులు ధ్వసం చేశారు. పలమనేరు అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో 82 కేసులకు సంబంధించి రూ. 17.98 లక్షల విలువచేసే 2569.69 లీటర్లు, బైరెడ్డిపల్లె పరిధిలో 56కేసులకు సంబంధించి రూ.8 లక్షల విలువైన 1,142.29 లీటర్లు, పలమనేరు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో 66 కేసులకు సంబంధించి రూ.1.33 లక్షలు విలువ చేసే 190 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. ఎస్ఈబీ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ వి.శ్రీధర్‌రావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.రవి, పలమనేరు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్.ఐ బి.కృష్ణయ్య బైరెడ్డిపల్లి ఎస్ఐ, పలమనేరు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతిలో డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

తిరుపతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): డైరెక్టరేట్ ఆఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ అండ్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో తిరుపతి కేంద్రంగా డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఏర్పాటు కానుంది. ఇక్కడ ఈ కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. తిరుపతి కార్యాలయం పరిధిలోకి తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు జిల్లాలు రానున్నాయి. అలాగే దీని పరిధిలో కడప, నెల్లూరు, తిరుపతి సబ్ డివిజన్లు వుంటాయి. ఇప్పటికే సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ కేంద్రంగా విద్యుత్ శాఖకు సంబంధించి తిరుపతి కీలక కేంద్రంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా నేరుగా ప్రభుత్వ నియంత్రణలో పనిచేసే ఎలక్ట్రికల్ సేఫ్టీ విభాగానికి సంబంధించి కూడా తిరుపతి ముఖ్య పాలనా కేంద్రంగా మారనుంది. తిరుపతిలో కార్యాలయం ఏర్పాటుకు అనుమతినిస్తూ, అలాగే డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టు మంజూరు చేస్తూ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కారు ఢీకొని ముగ్గురు కూలీల దుర్మరణం



రోడ్డుపై చెల్లాచెదురుగా రాజాసింగ్,బపున్‌సింగ్, సుఖ్‌దేవ్‌సింగ్ మృతదేహాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 11: పొట్టకూటికి పొరుగు రాష్ట్రం నుంచి వచ్చిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం మేరకు ..ఒడిశాకు చెందిన బపున్‌సింగ్ (21) రాజాసింగ్(22) సుఖ్‌దేవ్‌సింగ్(22) బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఆలత్తూరు శ్రీనిధి రాజా పరిశ్రమలో రెండేళ్లుగా కూలీలుగా పనిచేస్తున్నారు. కంపెనీ సమీపంలోనే కలసి ఉంటున్నారు. గురువారం వంట సరుకులు కొనుగోలు చేయడానికి కంపెనీ మేనేజర్ ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళ్లి తిరిగి వస్తుండగా బుచ్చినాయుడుకండ్రిగ నుంచి అతి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరారైన కారు డ్రైవరు కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.

జనాభా నియంత్రణతోనే అభివృద్ధి


మదనపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న అర్బన్‌హెల్త్ సెంటర్ సిబ్బంది


పెద్దమండ్యంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

మదనపల్లె టౌన్, జూలై 11: జనాభా పెరుగుదల నియంత్రణతోనే అభివృద్ధి సాధ్యమని డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక దొంతి వీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన వనరుల కొరత ఏర్పడి, ఆర్థికంగా వెనకబడి పోతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో జనాభా నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సల్మాన్, డీపీఎంవో వేణుగోపాల్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: జనాభా నియంత్రణతోనే దేశాభివృద్ధి, కుటుంబ ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో కృష్ణమూర్తి, తహసీల్దారు బ్రహ్మయ్య పేర్కొన్నారు. గురువారం వైద్యాధికారి మునికుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణానాయక్, ఏఎన్ఎం కుతీజ, కవిత, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర టీడీపీ నాయకులు పురుషోత్తం, స్వామిరెడ్డి, కృష్ణమూర్తి, ఆశా వర్కర్లు రెడ్డమ్మ, రామలక్ష్మీ, భారతి, పాల్గొన్నారు.

పీలేరులో: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పీలేరు పట్టణంలో గురువారం రేగళ్ల పీహెచ్‌సీ సిబ్బంది అధిక జనాభాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కార్తీక్ కుమార్ మాట్లాడుతూ అధిక జనాభా వల్ల పేదరికం, అవిద్య, అనారోగ్యం, పౌష్టికాహార లోపం, మౌళిక వసతుల లేమి వంటి అనేక అనర్థాలు పొంచి ఉన్నాయన్నారు. బాధ్యత గల ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలన్నారు. కుటుంబ నియంత్రణ కోసం తాత్కాలిక, శాశ్వత పద్ధతులు ఉన్నాయన్నారు. వివాహ వయస్సును యువకుల్లో 25 ఏళ్లు, అమ్మాయిల్లో 21గా నియమం పెట్టుకోవాలన్నారు. అనంతరం అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలను వివరించే ప్లకార్డులు చేతబూని స్థానిక పాత బస్టాండు నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జయలక్ష్మి, సూపర్‌వైజర్ రమాదేవి, చిన్నప్ప, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: కుటుంబ నియంత్రణ పాటించాలని పెద్దమండ్యం పీహెచ్‌సీ డాక్టర్లు ఇమ్మానుయేల్, హరివర్మ, మహబూబ్‌బాష పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. పెద్దమండ్యంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశా సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. చిన్న కుటుంబం చింత లేని కుటుంబమంటూ నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గుర్రంకొండ వైద్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హైస్కూల్ విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో మానవహారం నిర్వహించి జనాభా నియంత్రణపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రనాయక్, సిబ్బంది సీతారామయ్య, నాగరాజు, రమేష్‌లు పాల్గొన్నారు.

కలకడలో: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపల్లె డాక్టర్ జవహర్‌బాబు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ అధిక జనాభా వలన కలిగే నష్టాలను వివరించారు. అలాగే బాల్యవివాహాల నిర్మూలకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది జయరామయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బరత్నమ్మ, వాణి, లావణ్యలు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: అధిక జనాభా అనర్థాలకు మూలమని వాల్మీకిపురం మండలం చింతపర్తి పీహెచ్‌సీ వైద్యులు శ్రీవిద్య, జులేఖబేగం పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని, వికసిత్ భారత్ మహోత్సవంలో భాగంగా గురువారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా గ్రామాలలో కుటుంబ నియంత్రణ పట్ల ర్యాలీ చేపట్టి జనాభా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సనా అయేషా, సమాజిక ఆరోగ్య అధికారిణి ఇందిరారాణి, సూపర్‌వైజర్లు సుధాకర్, భానబీ ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


కలకడలో ర్యాలీలో వైద్యాధికారి, విద్యార్థులు



గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు,సిబ్బంది

మంత్రులను కలసిన తంబళ్లపల్లె టీడీపీ నేతలు

తంబళ్లపల్లె, జూలై 11: రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, వ్యవసాయ, పశుసంవర్థక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎక్సైజ్, గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్రను తంబళ్లపల్లె తెలుగుదేశం పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. గురువారం అమరావతిలోని వారి క్యాంపు కార్యాలయాల్లో టీడీపీ తంబళ్లపల్లె మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశ్రీనివాసులు, యూనిట్ ఇన్‌చార్జి రెడ్డప్ప, రాజంపేట పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు మలిగి వెంకటరెడ్డిలు కలసి పుష్పగుచ్ఛం అందచేసి దుశ్శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రులు..తంబళ్లపల్లెలో టీడీపీ ఓటమి చెందడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం తంబళ్లపల్లెలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులను మంత్రులకు వివరించినట్లు తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గం వైపు దృష్టి సారించి అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రులను కోరినట్లు టీడీపీ నేతలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా ఉండాలి


గంగజాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం, జూలై 11: గ్రామ పంచాయతీ సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం రామసముద్రం రెండో సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అంతకుముందు మూగవాడి పంచాయతీ గొల్లపల్లెలో జరిగిన గంగజాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు అమరప్ప, శివశంకర్‌రెడ్డి, కృష్ణంరాజు, శివశంకర, లోకేష్, శ్రీనాథ్, పెద్దప్పయ్య, మహ్మద్, ఆనంద్, సుబ్రహ్మణ్యం, కృష్ణప్ప, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత మున్సిపాలిటీ తీసుకోవాలి

మదనపల్లె అర్బన్, జూలై11:మొక్కలను సంరక్షించే బాధ్యత మున్సిపల్ అధికారులు తీసుకోవాలని టౌన్ అఫెక్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు పేర్కొన్నారు. పేదల ఊటీగా పేరుగాంచిన మదనపల్లె పట్టణంలో ప్రతి ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమానికి మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శ్రీకారం చుట్టారని ఆయన తెలిపారు. పచ్చదనం , పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పట్టణంలో 50 వేల మొక్కులు నాటే కార్యక్రమం ఎమ్మెల్యే చేపట్టారన్నారు. వాటికి మున్సిపాలిటీ అధికారులు సిబ్బందితో ట్రీగార్డులు ఏర్పాటు చేసి నాటిన మొక్కలు ఎండిపోకుండా వేపుగా ఎదిగు విధంగా ప్రతి రోజు నీరు పోసి సంరక్షించాలన్నారు.

మల్లన్న సేవలో టీడీపీ నేత

తంబళ్లపల్లె, జూలై 11: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండలో కొలువైన భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామిని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు దర్శించు కున్నారు. గురువారం ఉదయం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలసి మల్లయ్యకొండకు వెళ్లి మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో తలతూగాలని, ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఆలయ ఈవో రమణ స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేసి దుశ్శాలువలతో సత్కరించారు.

గాయపడ్డ టీడీపీ కార్యకర్తకు పరామర్శ

ములకలచెరువు, జూలై 11: మండలంలోని మద్దినాయనిపల్లె పంచాయతీ దారంవాండ్లపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త దయ్యాల శ్రీనివాసులును గురువారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ శ్రీనివాసులుకు వైద్య ఖర్చులకు గానూ ఆయన రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంత్రి గిరిధర్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి; పజురుల్లా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కురబలకోట, జులై 11: నిప్పంటుకుని గాయపడి చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ దిగువచెన్నామర్రికి చెందిన నారాయణరెడ్డి వారం రోజుల క్రితం ఇంట్లో దేవుడి గదిలో దీపం వెలిగించడానికి పొరబాటున నూనె అనుకుని పెట్రోల్‌ను పోసి అంటించడంతో మంటలు రావడంతో ఆ దీపాన్ని బయటకు విసిరేయడంతో బయట ఉన్న అతని భార్య రమణమ్మ చీరకు తగిలి నిప్పంటుకోవడంతో గాయపడింది. ఆమెను బెంగళూరు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థినులు ఎంపిక

నిమ్మనపల్లి, జూలై 11: మండలంలోని స్థానిక జడ్పీహైస్కూలో పదో తరగతి చదివిన ఇద్దరు విద్యార్థినులకు గురువారం విడుదలైన ట్రిపుల్ ఐటీకి మెరిట్‌లో ఎంపికైనట్లు హెచ్ఎమ్ అంజాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 22న విడుదలై పదో తరగతి ఫలితాల్లో ఎస్ శ్రావ్య, కె. శ్రావణిలు స్కూల్‌లో మొదటి స్థానం సాధించారన్నారు. దీంతో వారు ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా వారికి సీటు వచ్చిందని తెలిపారు. వారు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో విద్యార్థుల తల్లి దండ్రులతో పాటు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది పాఠశాల నుంచి విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక అవుతూ నిమ్మనపల్లికి మంచి తెస్తున్నారని కొయాడారు.

పెద్దతిప్పసముద్రంలో: స్థానిక పీటీఎంలోని ఆదర్శ పాఠశాల 2023-24 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన గొల్లపల్లె భవ్యశ్రీ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ (ఆర్‌జియూకేటి)టెక్నాలజీ ఎచ్చర్ల శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఎంఈవో నారాయణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివకుమారిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థి 600 మార్కులకు గాను 567 మార్కులతో మొదటి స్థానంలో నిలిచిందని, ఇప్పుడు ట్రిపుల్ ఐటీలో స్థానం సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

నేడు మండల సమావేశం

కురబలకోట, జూలై 11:స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హరినారాయణ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చదువుతోపాటు సామాజిక సేవ అవసరం


ఎన్‌సీసీ సర్టిఫికెట్లతో విద్యార్థులు

వాల్మీకిపురం, జూలై 11: చదువుతో పాటుగా ప్రతి విద్యార్థి సామాజిక సేవలో ముందుండాలని వాల్మీకిపురం పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సావిత్రి పేర్కొన్నారు. గురువారం పాఠశాలలోని 25మంది ఎన్‌సీసీ క్యాడెట్స్‌కి క్యాంపు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. 35ఆంధ్రా బెటాలియన్, ఎన్‌సీసీ, చిత్తూరు వారి ఆధ్వర్యంలో 3వ అన్యూవల్ ట్రైనింగ్ క్యాంపు ఈ సంవత్సరం మే 17 నుంచి 26 వరకు జరిగిందని అందులో పాల్గొని, విశేష ప్రతిభ కనబరిచిన క్యాడెట్స్‌ని అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటుగా అన్ని రంగాలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో కేర్ టేక్ ఆఫీసర్ రవీంద్రా రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీరు అనుకుని యాసిడ్ తాగిన వ్యక్తి మృతి

మదనపల్లె టౌన్, జూలై 11: ఆయాసంతో బాధపడుతున్న వ్యక్తి తాగు నీరు అనుకుని యాసిడ్ తాగగా, చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల కథనం మేరకు...ములకచెరువు మండలం వేపూరికోటకు చెందిన వెంకటరమణ(52) ఆరేళ్లుగా ఆయాసంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం తన దగ్గు ఎక్కువ కావడంతో తాగునీటి కోసం వెతికాడు. పక్కనే వున్న డబ్బాలో యాసిడ్ చూసి నీరు అనుకుని తాగేసాడు. దీంతో కిందపడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్న వెంకటరమణను కుటుంబీకులు మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో చేర్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు రోహిత్, కుమార్తె పావని వున్నారు. రోహిత్ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

భూ తగాదాలో ముగ్గురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, జూలై 11: మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతి గొల్లపల్లికి చెందిన భూతగాదాలో ముగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గుండ్లబురుజుకు చెందిన మునీంద్ర గొల్లపల్లి సమీపంలో కొంత భూమిని నాగరాజ వద్ద కొనుగోలు చేశాడు. అయితే దీని సంబంధించి అడ్వాన్స్‌గా కొంత డబ్బు చెల్లించి మిగిలి మొత్తాన్ని రిజిస్ట్రేషన్ అయిన తరువాత ఇస్తానని తెలిపాడు. కాగా మునీంద్ర తన భూమిలో దుక్కులు దున్నుతుండా గొల్లపల్లికి చెందిన నాగరాజ, వెంకటరమణ, హరిప్రసాద్‌లు భూమి వద్దకు వెళ్లి మునీంద్రతో గొడవపడి అతనిని గాయపరచడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

మదనపల్లె అర్బన్, జూలై11: కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సీఐ శేఖర్ తెలిపారు. మదనపల్లె పట్టణం ఎగువకురవంకకు చెందిన మల్లికార్జున, మునిరాజాలు ఇద్దరు ద్విచక్రవాహనంపై 102 కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో చీకలబైలు చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేసి మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని వారిపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం



నిమ్మనపల్లి, జూలై 11: మండలంలోని బాహుదా కాలువలో అక్రమంగా ఇసకను తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని తహసీల్దార్ గోపాల్‌రాజుకు అప్పగించినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుకును ఉచింగా ఇవ్వ నున్నట్లు ప్రకటించడంతో రీచ్‌లు ప్రకటించని చోట కూడా అక్రమంగా ఇసుకును తరలిస్తున్నారని తెలపారు. వాస్తవానికి నిమ్మనపల్లి పరిసర ప్రాంతాలలో ఎలాంటి ఇసుక రీచ్‌లు లేవని తెలిపారు. ఇసుక కావలసిన వారు రీచ్‌లలో మాత్రమే ఎత్తుకోవాలన్నారు.

సారా స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లె, జూలై 11: మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయితి సోమానపల్లిలో సారా 10లీటర్ల సారాతో పాటుగా ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సోమానపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పి.సుధాకర్(45) సారాను అమ్ముతుండగా అతనిని పట్టుకొని అతని వద్ద నుంచి 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలి


తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న మాల మహానాడు నేతలు

పీలేరు, జూలై 11: పీలేరు మండలంలో 2019-24 మధ్య జరిగిన ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలని మాలమహానాడు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు తహసీల్దారు మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరిమడుగు సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రజా అవసరాలకు పనికివచ్చే వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను గత ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ అధికారులే అప్పటి అధికార పార్టీ నాయకుల పరం చేశారని ఆరోపించారు. నిబంధనలకు వ్యతిరేకంగా అప్పటి అధికార పార్టీ నేతల సేవలో తరించి భూములను అన్యాక్రాంతం చేసిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు బద్దే భానుప్రకాశ్, జెట్టి మల్లిఖార్జున, రామచంద్ర, తుమ్మల ధరణీకుమార్, ఆనంద్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

సీఎన్ఆర్ డిగ్రీ కళాశాలకు 'ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు'


అవార్డు అందుకుంటున్న సీఎన్ఆర్ డిగ్రీ కళాశాల యాజమాన్యం

పీలేరు, జూలై 11: పీలేరులోని సీఎన్ఆర్ డిగ్రీ కళాశాలకు ప్రతిష్టాత్మక 'ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు-2024' లభించింది. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించే వ్యక్తులు, సంస్థలకు న్యూఢిల్లీకి చెందిన ఏషియా టుడే మీడియా సంస్థ 'ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డు' అందజేస్తుంది. ఈ ఏడాది విద్యా రంగంలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను సీఎన్ఆర్ డిగ్రీ కళాశాలను ఆ అవార్డు ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న పలు డిగ్రీ కళాశాలలు పోటీ పడిన ఈ అంశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి సీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఈ ఏడాది అవార్డును స్వంతం చేసుకుంది. బెంగళూరులో గురువారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సీఎన్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్, ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్యలకు పద్మశ్రీ డాక్టర్ సీఎన్ మంజునాథ్, కర్ణాటక మాజీ సీఎం, ప్రస్తుత ఎంపీ జగదీష్ షెట్టర్, ప్రముఖ బాలివుడ్ నటుడు గుల్షన్ గ్రోవర్ అందజేశారు. ఈ సందర్భంగా వారిద్దరు మాట్లాడుతూ గత 21 ఏళ్లుగా తమను ఆదరిస్తున్న పీలేరు పరిసర ప్రాంత ప్రజలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన, వివిధ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలు, పెద్దఎత్తున క్యాంపస్ ప్లేస్ మెంట్ల కారణంగా తమకు అవార్డు లభించినట్లు వారు వివరించారు. 'ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డు' తమ పట్ల మరింత బాధ్యత పెంచిందన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ

పీలేరు, జూలై 11: పీలేరు మండలం దేవళంపల్లెలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పులిచెర్ల మండలం అరవవాండ్లపల్లెకు చెందిన సుధాకర్ నాయుడు విద్యాసామగ్రి వితరణగా అందజేశారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో దాత సుధాకర్ నాయుడు మాట్లాడుతూ తన తల్లి పద్మావతమ్మ జ్ఞాపకార్థం ప్రతి ఏడాదీ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర్ రెడ్డి, పాఠశాలహెచ్ఎం విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు సురేశ్‌బాబు, సుధాకర్, సాంబశివ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీపై వైసీపీ రాద్ధాంతం తగదు

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు


తెలుగు యువత నాయకులతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

మదనపల్లె టౌన్, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీపై వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక దేవతానగర్ వద్ద టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆయన తెలుగు యువత నాయకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనతో ఇసుక మాఫియా దోపిడీ చేసి తాడేపల్లె ప్యాలెస్‌కు తరలించారన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణరంగం వైసీపీ పాలనతో ఇసుక ధరలు తట్టుకోలేక కుదించుకుపోయాయయన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చి నెల రోజులు కాకనే ఉచిత ఇసుక పథకం ప్రవేశపెట్టి ఇసుక కావాల్సిన వారు ఆయా రీచ్‌ల వద్ద రవాణా, కూలీల చార్జి చెల్లిస్తేచాలన్నారు. అనంతరం తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌తేజ మాట్లాడుతూ మదనపల్లెలో టీడీపీ అభ్యర్థి గెలుపునకు తెలుగు యువత కృషి చేసిందని, భవిష్యత్‌లో వారికి పార్టీలో, నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జగన్‌మోహన్‌రాజును కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమశేఖర్, శ్రీనాథరెడ్డి, బావాజాన్, గోవర్ధన్, కరుణాకర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు


వెలగపూడిలో మంత్రి పేషి ఎదుట బీటీ కళాశాల అధ్యాపకేతర ఉద్యోగులు

మదనపల్లె టౌన్, జూలై 11: మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి వైఖరిపై ఆ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకేతర ఉద్యోగులు గురువారం వెలగపూడిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెలగపూడి నుంచి వారు ఫోన్‌లో మాట్లాడుతూ 16 ఆగస్టు 2022న జీవో నెంబర్ 29తో మదనపల్లె బీటీ కళాశాల ప్రభుత్వ పరమైందన్నారు. అప్పటి నుంచి 18 మంది అధ్యాపక సిబ్బంది, 14 మంది అధ్యాపకేతర సిబ్బంది నియామకంపై ప్రభుత్వం నుంచి వచ్చిన కమిటీలు విచారణ జరిపి, వారి అర్హత పత్రాలను తీసుకున్నారన్నారు. కాని 23 నెలలుగా తమకు వేతనాలు ఇవ్వకుండా, ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులను అమలు చేయకుండా ప్రిన్సిపాల్ తమను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అంతే కాకుండా గత నాలుగు నెలలుగా తమకు అటెండెన్స్ కూడా వేయడం లేదన్నారు. పేదలైన తాము జీతాలు లేక అప్పులపాలవుతున్నామన్నారు. ప్రస్తుతం డిగ్రీ అడ్మిషన్లు జరుగుతున్న సమయంలో ప్రిన్సి పాల్ వైఖరితో కళాశాలలో అడ్మిషన్లు కూడా తక్కువగా ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ సమస్యలపై విచారించి న్యాయం చేయాలని మంత్రి లోకేశ్‌కు విన్నవించామన్నారు.

ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి చూపండి

పెద్దతిప్పసముద్రం జూలై 11 : ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి చూపాలని ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో ఉద్యాన పంటలను సాగు చేపట్టే విధంగా ఉపాధి సిబ్బంది రైతులకు ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా పండ్లతోటలు చేపట్టే రైతులకు మూడు సంవత్సరాలకు తోటల సంరక్షణకు మామిడి తోట లకు ఎకరాకు 70 మొక్కలకు రూ.99,911లు, కొబ్బరి చెట్లకు ఎకరాకు 65 మొక్కలకు రూ.88,300లు, అల్లనేరేడుకు ఎకరాకు 40 మొక్కలకు రూ.61వేలు ఇస్తారన్నారు. పీటీఎం మండలంలో ప్రభుత్వం నిర్దేశించిన 300 ఎకరాలకంటే అధికంగా చేపట్టే విధంగా రైతులు ముందుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని రైతులు ఉద్యాన సాగును చేయదలచిన వారు ఉపాధి జాబ్ కార్డు ఆదార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్ జిరాక్స్ ప్రతులతో ఉపాధి కార్యాలయంలో ఇచ్చి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.అదే విధంగా పాడి రైతులు పశుగ్రాసం పెంచుకోవడం చేపట్టవచ్చని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 30శాతం ఐఆర్ ప్రకటించాలి


30శాతం ఐఆర్ కావాలంటున్న ప్రభుత్వ ఉద్యోగులు

రామసముద్రం, జూలై 11: ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే 30శాతం ఐఆర్ ప్రకటించాలని అన్నమయ్య జిల్లా ఎస్‌టీయు ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి డిమాండ్ చేశారు. గురువారం రామసముద్రం మండలంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చెంబకూరు, మట్లవారిపల్లె, రామసముద్రం ఉన్నత పాఠశాలల్లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెందిన పీఆర్‌సీ, డీఏ పెండింగ్ బకాయిలను చెల్లించాలని విద్యా వ్యవస్థకు నష్టం కలిగించే 117జీవోను రద్దు చేయాలని కోరారు. అమ్మకు వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపచేయాలని కోరారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడును శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆర్థిక కార్యదర్శి అయూబ్‌ఖాన్, రమాదేవి, సురేష్, హెచ్ఎంలు విష్ణుప్రియ, బాలసుబ్రహ్మణ్యం, గాయత్రి, ఎస్టీయూ జిల్లా, మండల నాయకులు శంకర, మనోహర్, నరసింహులు, మహిధర్, అనిల్‌కుమార్, జగన్నాథ్‌రెడ్డి, కేశవ, కుసుమకుమారి, లక్ష్మీశాంతి, ఆశాజ్యోతి, శివశంకర్, శ్రీరాములురెడ్డి, బాలాజి, సుబ్బారెడ్డి, కృష్ణమూర్తి, కృష్ణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలికిరి ఉపసర్పంచుగా ఎల్లయ్య ఏకగ్రీవం


ఎల్లయ్యను బలపరుస్తున్న వార్డు సభ్యులు

కలికిరి, జూలై 11: కలికిరి మేజర పంచాయతీ ఉపసర్పంచుగా 14వ వార్డు సభ్యుడు ఆర్.ఎల్లయ్యను వార్డు సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కలికిరి పంచాయతీ కార్యాలయంలో మండల ఈవోపీఆర్‌ఆర్‌డీ పరశురాం ఆధ్వర్యంలో ఈవో గురుమోహన్ ఎన్నిక చేపట్టగా మిగిలిన సభ్యులంతా చేతులు ఎత్తి ఆయనకు సంఘీభావం తెలిపి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కలికిరి సర్పంచు రెడ్డివారి ప్రతాప రెడ్డి నెల క్రితం మరణించడం, ఉపసర్పంచుగా ఉన్న వేంపల్లె నూరున్నిసా తన పదవికి రాజీనామా చేయడంతో ఉపసర్పంచు ఎన్నిక అనివార్యమైంది. ఏకగ్రీవంగా ఎన్నికైన ఎల్లయ్యను తాత్కాలిక సర్పంచుగా కూడా బాధ్యతలు చేపట్టడానికి అనుమతి కోసం ఉన్నతాధికా రులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఈవో గురుమోహన్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బషిరూన్, అల్లాబక్ష, ఖాదర్‌బాషా, విశ్వనాథ్, అజయ్, నూరున్నిసా, నస్రీన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతి అందుకున్న విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యజమాన్యం

మదనపల్లె టౌన్, జూలై 11: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ ఫైనాన్షియల్ లిటరిసి క్విజ్ పోటీల్లో శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరచారని కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ క్విజ్ పోటీల్లో నాలుగు రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొనగా, వారిలో అధిక సంఖ్యలో తమ కళాశాల నుంచి పాల్గొన్నారు. వారి ప్రతిభను గుర్తించిన ఎన్ఐఎస్ఎం తమ కళాశాలకు మూడో బహుమతి కింద రూ.25వేలు నగదు సర్టికెట్స్ అందించారన్నారు. ఇటీవల ముంబైలో సెబీ డైరెక్టర్ రామ్మోహన్‌రావు చేతుల మీదుగా తమ విద్యార్థినులు రిషిత, సుజిత, వైస్‌ప్రిన్సిపాల్ రాఘవేంద్ర బహుతులు అందుకున్నారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

బీసీజీ టీకా పట్ల అపోహలు వద్దు

తంబళ్లపల్లె, జూలై 11: బీసీజీ టీకాపై ప్రజలు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని, అర్హులైన వారందరూ నిర్భయంగా ముందుకు వచ్చి టీకా వేసుకుని క్షయ వ్యాధి నియంత్రణకు సహకరించాలని వైద్యాధికారి మునికుమార్ కోరారు. గురువారం మండల వ్యాప్తంగా బీసీజీ టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. బీసీజీ టీకా సురక్షితమైనదని దీనిపై ఎటువంటి అపోహలు అవసరం లేదన్నారు. టీకా వేసుకోవడం వలన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి క్షయ వ్యాధి రాకుండా అడ్డుకట్ట వేయవచ్చన్నారు. గడిచిన 5 ఏళ్లలో టీబీ వచ్చి తగ్గిపోయినవారు, వారి సన్నిహితులు, 18 ఏళ్లు నిండిన వారు, పొగతాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, శరీర ద్రవ్యరాశి సూచిక 18 కన్నా తక్కువ ఉన్నవారు తప్పకుండా ముందుకు వచ్చి టీకా వేసుకోవాలన్నారు. ప్రతి గురువారం అన్ని సబ్‌సెంటర్లలో బీసీజీ టీకాలను ఉచితంగా వేస్తారన్నారు. గురువారం మండల వ్యాప్తంగా 113 మందికి టీకా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.